# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 3-9-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :29 | సంచిక: 27 | పేజీలు:6 | వెల: రూ.1/-


## ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టుల మృతి

హైదరాబాద్, సెప్టెంబర్ 2: మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మరణించారు. జార్ఖండ్‌లోని సెరియకేలా–ఖర్సవాన్ జిల్లాలో మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఉదయం బరుడా అటవీ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ కోబ్రా, జార్ఖండ్ జాగ్వార్ దళాలు, రాష్ట్ర పోలీసులు సంయుక్తంగా గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య హోరాహోరీ కాల్పులు జరిగాయి. ఇందులో ఇద్దరు సీపీఐ మావోయిస్టులు మరణించారని కొల్హాన్ ఐజీ అజయ్ లిండా తెలిపారు.

## పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో 78.82 శాతం ఉత్తీర్ణత

హైదరాబాద్, సెప్టెంబర్ 2: పదో తగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లోనూ అమ్మాయిల హవా కొనసాగింది. సప్లిమెంటరీ ఫలితాలను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన విడుదల చేశారు. మొత్తం 79.82 శాతం మంది ఉత్తీర్ణులవగా, వారిలో 78.42 శాతం మంది బాలురు, 82.21 శాతం మంది బాలికలు ఉన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఆగస్టు 1 నుంచి 10 వరకు నిర్వహించారు. వీటికోసం 55,663 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 48,167 మంది పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 38,447 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 14,614 మంది అమ్మాయిలు, 23,833 మంది అబ్బాయిలు ఉన్నారు. కాగా, 97.99 శాతం ఉత్తీర్ణతతో సిద్దిపేట జిల్లా మొదటి స్థానంలో నిలువగా, 53.11 శాతంతో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా చివరి స్థానంలో ఉంది.

**పరీక్షల ఫలితాల్లో సిద్దిపేట టాప్**

తెలంగాణలో పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. సైఫాబాద్‌లోని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కార్యాలయంలో ఫలితాలను పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ దేవసేన శుక్రవారం విడుదల చేశారు. విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం 79.82గా నమోదైంది. 48,167 మంది సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కాగా, 38,447 మంది ఉత్తీర్ణత సాధించారు.

బాలుర పాస్ పర్సంటేజ్ 78.42 శాతం, బాలికల పాస్ పర్సంటేజ్ 82.21 శాతంగా ఉంది. ఉత్తీర్ణతలో సిద్దిపేట జిల్లా 97.99 శాతంతో ప్రథమ స్థానంలో నిలువగా, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా 53.11 శాతంతో చివరిస్థానంలో నిలిచింది. ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు రీకౌంటింగ్‌కు అవకాశం కల్పించారు. ఒక్కో సబ్జెక్ట్‌కు రూ. 500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.

## రైతుబంధును కాపీకొట్టిందెవరు? : మంత్రి హరీశ్‌రావు



మెదక్, సెప్టెంబర్ 2 : నేటినిజం ప్రతినిధి):కేంద్ర పథకాల పేర్లు మార్చి ప్రచారం చేసుకుంటున్నారని తెలంగాణపై కేంద్రం మంత్రి నిర్మలాసీతారామన్ అసత్యాలు మాట్లాడారని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఏయే పథకం మార్చామో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు బంధును కేంద్రం కాపీకొట్టిందన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి అని పేరు మార్చుకున్నారని ఎద్దేవా చేశారు. మెదక్‌జిల్లా తూప్రాన్‌లో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతు బంధు కేంద్రం పెట్టిందా..రాష్ట్రం పెట్టిందా? అని నిర్మలా సీతారామన్‌ను ప్రశ్నించారు. ప్రతీ రైతుకు?ప్రతీ ఎకరానికి రూ. పది వేలు రూపాయలు ఇస్తున్నామన్నారు. ఇందులో పైసా అయినా కేంద్రానిది ఉందా? అని ప్రశ్నించారు. రైతుబంధు కేసీఆర్ గుండెల్లోంచి పుట్టిందన్నారు. అలాగే, రైతు బీమాలో మీది ఒక్క రూపాయన్నా ఉందా? అని ప్రశ్నించారు. 24 గంటల ఉచిత కరెంటును కాపీ కొట్టామా? అని ప్రశ్నించారు. ఏ బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రైతుకు 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నారో నిర్మలాసీతారామన్ చెప్పాలన్నారు. బాన్సువాడలో తిరుగుతున్న నిర్మలా సీతారామన్.. అక్కడి రైతును అడగండి.. రైతు బంధు, రైతు బీమా, ఉచిత కరెంటు ఎలావస్తుందో చెబుతారన్నారు.

**దేశమంతటా తెలంగాణ పథకాలు ఇవ్వండి..**

కేంద్ర మంత్రిగా రేపటి బడ్జెట్‌లో దేశమంతటా రైతులకు 24 గంటల ఉచితవిద్యుత్ ఇవ్వాలని నిర్మలాసీతారామన్‌ను మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణలాగా దేశంలోని ప్రతి రైతుకూ రైతు బంధు, రైతు బీమా ఇవ్వాలన్నారు. తెలంగాణ సర్కారు ఏ కేంద్ర పథకాన్ని కాపీ కొట్టిందో నిర్మలాసీతారామన్ ప్రజలకు వివరించాలని డిమాండ్ చేవారు. ఆసరా పెన్షన్, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి ఇందులో కేంద్రానికి ఒక్క రూపాయన్నా ఉందా? అని ప్రశ్నించారు. 'కేసీఆర్ కిట్ లో మీ భాగస్వామ్యం ఉందా? ఎందుకు మీ స్థాయి తగ్గించుకుంటున్నరు' అని నిర్మలాసీతారామన్‌ను ప్రశ్నించారు. రైతు బంధును మీరు సగం కాపీ కొట్టి ఎకరానికి ఆరువేలు.. అదీ కొందరికే ఇస్తున్నరని తెలిపారు. ప్రధాని గజ్వేల్‌లో స్వయానా నల్లా తిప్పి మిషన్ భగీరథను ప్రారంభిం చారని, దాన్ని కేంద్రం కాపీకొట్టి 'హర్ ఘర్ కో జల్' అని మార్చేసిందన్నారు.

**అర్ధ సత్యాలు. అవాస్తవాలు..**

బీజేపీ మంత్రులు అర్ధ సత్యాలు, అవాస్తవాలు మాట్లాడుతున్నారని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. మన ఊరు– మన బడి కార్యక్రమం కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్వహిస్తున్నట్టు చెప్పుకుంటున్నదన్నారు. ఇంత పచ్చి అబద్ధాలు మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. ఇవాళ తెలంగాణ సర్‌ప్లస్ నుంచి డెఫిసిట్ కు పోయిందని చెబుతున్నారని, మరి ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్ ఎందుకు రూ. 22 వేల 548 కోట్లు లోటులో ఉందని ప్రశ్నించారు. తెలంగాణలో ఫసల్ బీమా అమలుకావడం లేదని చెబుతున్న నిర్మలా సీతారామన్.. ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఎందుకు అమలు కావడం లేదో సమాధానం చెప్పాలన్నారు. తాను నిర్మలాసీతారామన్ అడిగిన ప్రతి ప్రశ్నకూ సమాధానమిచ్చానని, తాను అడిగిన ప్రశ్నలకు సమాధాన మివ్వాలని నిర్మలాసీ తారామన్‌ను డిమాండ్ చేశారు.

**ప్రధానిస్థాయిని దిగజార్చేలా నిర్మలాసీతారామన్ మాటలు**

తెలంగాణలో పర్యటిస్తున్న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారమన్ ప్రధానిస్థాయిన దిగజార్చేలా మాట్లాడుతున్నారని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తున్నామని చెప్పారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి అయి ఉండి ప్రధాని ఫొటో రేషన్‌షాపుల ముందు పెట్టమంటారా? అని మండిపడ్డారు. మొత్తం రేషన్ బియ్యం కేంద్రమే ఇచ్చినట్టు నిర్మాలా సీతారామన్ మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.

కేంద్రం కేవలం 55 శాతం బియ్యం మాత్రమే ఇస్తున్నదని, అదికూడా కిలోకు రూ. మూడు వసూలు చేస్తున్నదని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వమే తన ఖజానా నుంచి రూ. 3,610 కోట్లు ఖర్చుపెట్టి ఒక్కొక్కరికీ పది కిలోల బియ్యం ఉచితంగా అందిస్తున్నదని చెప్పారు. అలా అని రేషన్ షాపుల ముందు సీఎం కేసీఆర్ బొమ్మ పెట్టామా? అని నిర్మలాసీతారామన్‌ను ప్రశ్నించారు.

దేశాన్ని సాదే ఐదు ఆరు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ నుంచి దాదాపు లక్షా 70 వేల కోట్లు కేంద్రానికి అదనంగా ఇస్తున్నామని చెప్పారు. తెలంగాణ నిధులను ఇతర రాష్ట్రాలకు కేంద్రం పంచుతున్నదని తెలిపారు. మరి ఆయా రాష్ట్రాల్లో, కేంద్రంలో తెలంగాణ సీఎం కేసీఆర్ ఫొటో పెడుతారా? అని నిర్మలాసీతారామన్‌ను ప్రశ్నించారు. తెలంగాణ నుంచి రూ. 3 లక్షల 65 వేల 797 కోట్లు కేంద్రానికి వివిధ పన్నుల రూపంలో చేరితే, కేంద్రంనుంచి తెలంగాణకు వచ్చింది కేవలం

రూ. లక్షా 96వేల 448 కోట్లు మాత్రమేనని అన్నారు. పోయింది ఎక్కువ.. వచ్చింది తక్కువ అని చెప్పారు. కేంద్రాన్ని సాదడంలో తెలంగాణ వాటా ఉన్నదని, తెలంగాణ ప్రజల సంపద ఉన్నదని స్పష్టంచేశారు.

## ఎకో ఫ్రెండ్లీ గణేష్ నిమజ్జనం వాహనాలను ప్రారంభించిన మంత్రి తలసాని



హైదరాబాద్, సెప్టెంబర్ 2: పర్యావరణ పరిరక్షణపై ప్రజలలో అవగాహన కల్పించే విధంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ అన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బిలిటీ కింద ఫ్రీడమ్ ఆయిల్ కంపెనీ ఆధ్వర్యంలో రూపొందించిన ఇంటి ముందే వినాయకుడి నిమజ్జనం చేసే మూడు వాహనాలను టీఆఎస్ ఫుడ్ ఛైర్మన్ రాజీవ్ సాగర్ తో కలిసి మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గణేష్ నవరాత్రుల సందర్భంగా 6 లక్షల మట్టి విగ్రహాలను పంపిణీ చేశామన్నారు. మొట్టమొదటి సారిగా ఎకో ఫ్రెండ్లీ గణేష్ నిమజ్జనం వాహనాలను నగరంలో ప్రారంభించడం పట్ల నిర్వాహకులను మంత్రి అభినందించారు.

## బేగంపేట డిగ్రీ కళాశాలకు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్..మంత్రి సబితా ఇంద్రారెడ్డి హర్షం



హైదరాబాద్, సెప్టెంబర్ 2: బేగంపేట మహిళా డిగ్రీ కళాశాలకు 2021 ? 22 విద్యా సంవత్సరానికిగానూ నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) ఏ ప్లస్ గ్రేడ్ ఇవ్వడంపై రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పీ సబితా ఇంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వసతులు, బోధన, నిర్వహణ, ప్లేస్‌మెంట్స్‌లాంటి అంశాల ఆధారంగా న్యాక్ ప్రతినిధులు ఏ ప్లస్ గ్రేడ్ ఇచ్చారన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ కే పద్మావతి సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

అలాగే, రాష్ట్రంలో ఏ గ్రేడ్ సాధించిన ఆరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సిబ్బందిని, కళాశాల విద్య కమిషనర్‌ను మంత్రి సబితా ఇంద్రారెడ్డి అభినందించారు. బేగంపేట మహిళా డిగ్రీ కళాశాలలో ప్రత్యేకంగా రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి స్కాలర్లు తమ పరిశోధనలు చేసేందుకు అవకాశం కల్పించినట్టు మంత్రి తెలిపారు. విద్యార్థులు చేసే పరిశోధనల్లో సామాజిక కోణం ఉండేలా చూడాలని కోరారు. '

## హైదరాబాద్ సమీపంలో రూ. 200 కోట్లతో రాధాకృష్ణ మందిరం..



హైదరాబాద్, సెప్టెంబర్ 2: రూ. 200 కోట్లతో హైదరాబాద్ సమీపంలో రాధాకృష్ణ మందిరాన్ని నిర్మించాలని ఇస్కాన్ ప్రతిపాదించింది. 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించతలపెట్టిన మందిరానికి భూమిని కేటాయించాలంటూ ఇస్కాన్ ప్రతినిధులు అరణ్య భవన్‌లో దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు.

హైదరాబాద్‌కు సమీపంలో సంగారెడ్డి జిల్లాలో సాధారణ ధరకు లీజు పద్ధతిలో అనువైన స్థలాన్ని కేటాయించాలని మంత్రిని కోరారు. ఈ అంశాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని, ఆయన ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని మంత్రి చెప్పారు.

మందిర ప్రాంగణంలో గురుకులం, వృద్ధాశ్రామం, గోశాల కూడా నిర్మించనున్నట్లు ఇస్కాన్ ప్రతినిధులు మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, ఇస్కాన్ విశాఖనగర శాఖ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభుజీ, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, ఇతర ఇస్కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## భారతీయ నౌకాదళంలో చేరిన స్వదేశీ ఐఎన్ఎస్ విక్రాంత్



కొచ్చి, సెప్టెంబర్ 2: స్వదేశీయంగా తయారైన ఐఎన్ఎస్ విక్రాంత్ భారతీయ నౌకాదళంలోకి చేరింది. ప్రధాని చేతుల మీదుగా ఆ యుద్ధ నౌకను జలప్రవేశం చేయించారు. భారతీయ నౌకాదళ చరిత్రలో గతంలో ఇంత పెద్ద యుద్ధ నౌకను స్వదేశీయంగా తయారు చేయలేదు. కొచ్చిలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీతో పాటు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఇతరులు పాల్గొన్నారు.

యుద్ధ విమానాలను మోసుకెళ్లే ఐఎన్ఎస్ విక్రాంత్‌ను నౌకాదళంలోకి చేర్చుతున్న సందర్భంగా కొచ్చిన్ షిప్‌యార్డులో గ్రాండ్ సెర్మనీ నిర్వహించారు. 45వేల టన్నుల యుద్ధ విమానాన్ని సుమారు 20 వేల కోట్ల ఖర్చుతో నిర్మించారు.

విక్రాంత్ చాలా పెద్ద సైజ్‌లో ఉందని, చాలా గ్రాండ్‌గా ఉందని, చాలా విశిష్టమైందని, ఓ ప్రత్యేకమైందని ప్రధాని మోదీ అన్నారు. విక్రాంత్ కేవలం యుద్ధనౌక కాదు అని, హార్డ్‌వర్క్, ట్యాలెంట్‌కు ఇది నిదర్శనమని ఆయన అన్నారు. మారిటైమ్ జోన్‌ను ఐఎన్ఎస్ విక్రాంత్ రక్షిస్తుందని, నేవీలో ఉన్న మహిళ సైనికులు ఆ విధుల్లో చేరుతారని, అపరిమితమైన సముద్ర శక్తి, హద్దులు లేని మహిళా శక్తి.. కొత్త ఇడియాకు ఐడెంటీగా మారుతుందని ప్రధాని అన్నారు.

## నిర్మలమ్మ వరాలిస్తారనుకున్నా.. కానీ అన్నీ అబద్ధాలే మాట్లాడారు: స్పీకర్ పోచారం

బాన్సువాడ, వరంగల్, సెప్టెంబర్ 2: బాన్సువాడ నియోజకవర్గంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి హోదాలో పర్యటిస్తున్న నిర్మలా సీతారామన్ ప్రత్యేకంగా నిధులు, పథకాలు ఇస్తారని ఆశపడ్డానని, కానీ, ఆమె అన్నీ అబద్ధాలే మాట్లాడారని రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బాన్సువాడ పట్టణంలోని తన నివాసంలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాను స్పీకర్ హోదాలో మాట్లాడడం లేదని, నియోజకవర్గ శాసనసభ్యుడిగా, తెలంగాణ రాష్ట్ర మాజీ వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రిగా మాట్లాడుతున్నట్టు చెప్పారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తనకు అక్క లాంటి వారన్నారు. ఆమెతో తనకు రాజకీయంగా కానీ, వ్యక్తిగతంగా కానీ ఎలాంటి విభేదాలు లేవని చెప్పారు. గతంలో తాను వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఢిల్లీ వెళ్లి కోల్డ్ స్టోరేజీల మంజూరు కోసం వారిని కలిసి విజ్ఞాపన పత్రాలు ఇచ్చినా.. ఒక్కటి కూడా మంజూరు చేయలేదని చెప్పారు.

తాను పశుసంవర్ధక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలోని యాదవుల కోసం గొర్రెల పంపిణీ పథకం మొదలైందని స్పీకర్ పోచారం తెలిపారు. ఇందులో 25 శాతం లబ్ధిదారుడు, 75 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చేలా పథకం ప్రారంభించినట్టు చెప్పారు. అప్పుడు సీఎం అనుమతితో ఢిల్లీ వెళ్లి ఎన్సీడీసీ నుంచి రుణం తీసుకువచ్చామని, దీనికి కేంద్రం నిధులతో ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ పథకానికి కేంద్రమే నిధులిస్తోందని నిర్మలాసీతారామన్ అబద్ధం చెప్పారన్నారు. చేపల పంపిణీకి కూడా కేంద్రం నిధులిస్తోందని నిర్మలాసీతారామన్ అబద్ధాలు వల్లె వేశారని చెప్పారు. అప్పటి మత్స్య శాఖ మంత్రిగా ఉన్న తాను సీఎంకు విజ్ఞప్తి చేయగా.. వంద శాతం సబ్సిడీతో ఉచిత చేప విత్తన పంపిణీ ప్రారంభించారని గుర్తుచేశారు. ఈ పథకానికి కూడా ఎన్సీడీసీ రుణం ఇచ్చిందని వెల్లడించారు.

రైతు ఆత్మహత్యలపై కూడా నిర్మలా సీతారామన్ తప్పుగా మాట్లాడారని స్పీకర్ పోచారం మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయన్నారు. దేశంలో అతి తక్కువగా రైతుల ఆత్మహత్యలు జరిగే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని పేర్కొన్నారు. ఫసల్ బీమా పథకంలో లోపాలు ఉండడంతో రైతులే కోర్టుకు వెళ్లి అమలుచేయ వద్దంటూ ఆర్డర్ తెచ్చుకున్నారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ ఖర్చు మొత్తం రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ. 25,000 కోట్ల నిధులు ఇవ్వాలని నీతి ఆయోగ్ సిఫారసు చేసిందని, కానీ, కేంద్ర సర్కారు రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. జాతీయ హోదా ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదన్నారు. డబుల్ బెడ్ రూం పథకం కేంద్రానిదే అని నిర్మలా సీతారామన్ చెబుతున్నారు.. అలాంటప్పుడు పక్కనే ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలో ఈ పథకం ఎందుకు లేదని పోచారం ప్రశ్నించారు. సబ్సిడీ బియ్యంలో కూడా సగం కేంద్రానిది, సగం రాష్ట్రానిది అని, సబ్సిడీ బియ్యంపై రాష్ట్ర ప్రభుత్వం రూ. 3,600 కోట్లు ఖర్చు చేస్తున్నదని చెప్పారు. ఇకనైనా హుందాగా వ్యవహరించాలని, పార్టీలతో సంబంధం లేకుండా అందరం కలిసి రాష్ట్రం, దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

## బల్క్ డ్రగ్ పార్క్ కేటాయింపులో తెలంగాణకు కేంద్రం మొండిచెయ్యి: మంత్రి కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 2: బల్క్ డ్రగ్ పార్క్ కేటాయింపులో తెలంగాణకు కేంద్రం మొండిచెయ్యి చూపిందని మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణపై వివక్షతో మోదీ సర్కారు దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు అంతర్జాతీయ ప్రమాణాలతో నెలకొల్పుతున్న హైదరాబాద్ ఫార్మాసిటీ అత్యంత అనుకూలమని పేర్కొన్నారు. భూసేకరణ, పర్యావరణ అనుమతులు, మాస్టర్ ప్లానింగ్‌తో సిద్ధంగా ఉన్న ఫార్మాసిటీని కేంద్రం కావాలనే విస్మరించిందన్నారు.

కొత్తగా బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయాలంటే కనీసంగా మూడేళ్లు పడుతుందని తెలిపారు. అన్ని సిద్ధంగా ఉన్న హైదరాబాద్ ఫార్మాసిటీని పరిగణనలోకి తీసుకుపోకపోవడం.. ఫార్మా రంగాన్ని ఆత్మనిర్భరత దిశగా స్వయం సమృద్ధి చేయాలన్న లక్ష్యం పట్ల కేంద్రానికి ఉన్న నిబద్ధతలేమికి నిదర్శనమని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. అన్ని అనుకూలతలు, అనుమతులతో సిద్ధంగా ఉన్న హైదరాబాద్ ఫార్మాసిటీకి మొండి చెయ్యి ముమ్మాటికీ వివక్షేనని ధ్వజమెత్తారు. వెంటనే తెలంగాణకు బల్క్ డ్రగ్ పార్క్ కేటాయించాలని కేంద్రానికి మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు.

## నూతన 33 బీసీ గురుకులాలు అక్టోబర్ 11 నుంచి ప్రారంభం : మంత్రి గంగుల



హైదరాబాద్, సెప్టెంబర్ 2: సీఎం కేసీఆర్ బీసీల కోసం కేటాయించిన నూతన గురుకులాలు, డిగ్రీ కాలేజీల ప్రారంభానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది.

జిల్లాకు ఒకటి చొప్పున 33 నూతన గురుకులాలు అక్టోబర్ 11 నుంచి, నూతన డిగ్రీ కళాశాలలను అక్టోబర్ 15 నుంచి ప్రారంభించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అధికారులను ఆదేశించారు.

శుక్రవారం గురుకులాలు, డిగ్రీ కళాశాల ఏర్పాటుపై మంత్రి తన నివాసంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అత్యున్నత స్థాయి ప్రమాణాలతో వీటిని నెలకొల్పుతున్నామని, స్థలాల గుర్తింపు బాధ్యతను స్థానిక జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

గతంలో సీఎం హామీనిచ్చిన విధంగా హాలియా, దేవరకద్ర, కరీంనగర్, సిరిసిల్ల, వనపర్తితో పాటు పాత జిల్లాల ప్రతిపాదికగా ప్రతి జిల్లాలో డిగ్రీ కాలేజీలను ప్రారంభించాలన్నారు.

ఈ నూతన గురుకులాలతో మొత్తం బీసీ గురుకులాల సంఖ్య 310కి చేరింది.

ఇప్పటికే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 41 కులసంఘాలకు 95.25కోట్లు, కోకాపేట, ఉప్పల్ బగాయత్‌లో వేల కోట్ల విలువైన 87.3 ఎకరాల భూమిని కేటాయించిందన్నారు.

వీటిలో 24 కుల సంఘాలు ఇప్పటికే ఏకగ్రీవమై పట్టాలు పొందాయన్నారు.

మిగతా సంఘాల్లో సైతం ఏకగ్రీవాలు జరుగుతున్నాయని, ఇలా ఏకసంఘంగా ఏర్పడి ఆత్మగౌరవ భవనాలు నిర్మించుకునే వారికి ఈ నెల 8న పట్టాలను ప్రధానం చేసేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భర్తీ చేస్తున్న 80,025 ప్రభుత్వ ఉద్యోగాల కోసం తెలంగాణ బీసీ స్టడీ సర్కిళ్లు మరింత విస్తృతంగా అభ్యర్థులకు సేవలు అందించాలని మంత్రి గంగుల అధికారులను ఆదేశించారు.

12 స్టడీ సర్కిళ్లకు అదనంగా అతి త్వరలో మరో 50 స్టడీ సెంటర్ల ద్వారా గ్రూప్స్, డీఎస్సీ, తదితర పోటీ పరీక్షలకు నాణ్యమైన శిక్షణ అందించాలన్నారు. వీటి ద్వారా దాదాపు 25వేల మందికి పైగా నేరుగా లబ్ధి చేకూరుతుందన్నారు.

కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఎంజేపీ సొసైటీ సెక్రటరీ మల్లయ్యబట్టు, బీసీ స్టడీ సర్కిల్స్ డైరెక్టర్ అలోక్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు సంధ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### చరిత్రలో నేటినిజం





(సెప్టెంబర్ 3 జగ్గీవాసుదేవ్ జననం...)

–రాధశ్రీ

సెల్:9494481210



# మన నగరాల్లో విద్యుత్తు రవాణా వ్యవస్థలకు శ్రీకారం..!

బ్రిటన్‌కు చెందిన 'స్విచ్ మెబిలిటీ' రవాణా వాహనాల తయారీ సంస్థతో కలిసి భారత్‌కు చెందిన 'అశోక లేలాండ్' మరియు 'చెలో' అనబడే ప్రఖ్యాత రవాణా వాహనాల తయారీ సంస్థలు ఒప్పందం కుదుర్చుకొని రానున్న రోజుల్లో 5,000 పర్యావరణహిత ఎలక్ట్రిక్ బస్సులను (ఈ-బస్సులు) దేశవ్యాప్తంగా ప్రవేశ పెట్టనున్నాయనే విషయం దేశ పర్యావరణ వేత్తలకు సంతోషాన్ని కలిగిస్తున్నది. రానున్న మూడేళ్లలో స్విచ్ ఈ-బస్సులు దేశవ్యాప్తంగా మహానగరాలు, జిల్లాలు, పట్టణాల రోడ్లలో పరుగిడనున్నాయి. కంపెనీల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం యూకె "స్విచ్ కంపెనీ" భారత కంపెనీలకు 200 'ఈఐవి-22' బస్సులను ముంబాయి నగరంలో వినియోగానికి అందించనున్నాయి. భారత దేశంలోని రోడ్డు పరిస్థితులకు అనుగుణంగా రెండు రకాల ఈ-బస్సులను నిర్మించి వాడనున్నారు. ఒక్కసారి చార్జింగ్ చేసిన అత్యాధునిక పర్యావరణహిత ఈ-బస్సులు దాదాపు 300 కిమీ ప్రయాణించ వచ్చిన, రెండుసార్లు చార్జింగ్ చేసిన వాహనాలు 500 కిమీల వరకు ప్రయాణించడానికి వీలుందనా తెలుస్తున్నది. 1967లో అశోక్ లేలాండ్ కంపెనీ తొలిసారి శిలాజ ఇంధన డబుల్ డెక్కర్ బస్సులను ప్రవేశ పెట్టింది. అదే కంపెనీ నేడు యూకె సహాయంతో ఎలక్ట్రిక్ ఈ-బస్సులను తీసుకు రావడం ముదావహం. ప్రతి ఈ-బస్సుతో సాలీనా 1.3 లక్షల లీటర్ల డిజిల్ వినియోగం తగ్గుతుందని, దీనితో ప్రమాదకర ఉద్గారాల ప్రమాదం లేకుండా కూడా గాలి కాలుష్యం తగ్గనుంది.

## జీరో-ఉద్గార విద్యుత్తు ఈ-బస్సులు:

సమీప భవిష్యత్తులో భారతదేశంలో జీరో-ఉద్గార బస్సులు రానుండడంతో నేటి గాలి కాలుష్యం నుంచి నగరవాసులు కొంత మేరకు ఊపిరి పీల్చుకోనున్నారు. ఇప్పటికే యూకె, యూరోప్‌లో తిరుగుతున్న ఈ- వాహనాలు ఇండియాలో ఆలశ్యంగానైనా అందుబాటులోకి రావడం హర్షదాయకం. ఇండియా ప్రజారవాణా రంగం 48 శాతం బస్సులపై ఆధారపడి ఉన్నప్పటికీ నేడు ప్రతి 10,000 మందికి 3 బస్సులు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు తేలింది. నవతరం ఎలక్ట్రిక్ ఈ-బస్సుల రాకతో భారత నగరాలు, జిల్లాల్లో ప్రజారవాణాలో విప్లవాత్మక వాతావరణ మార్పులు రానున్నాయి. ఇటీవలే ముంబాయి మహానగరంలో 2 కోట్ల ఖరీదైన ఒక్కొక్క యూకె-ఆధార డబుల్ డెక్కర్ ఈ-బస్సులు ప్రవేశ పెట్టడం జరిగింది. దాదాపు ఒక్క డబుల్ డెక్కర్ ఈ-బస్సు ప్రవేశంతో 38 కార్లతో సమానంగా ప్రజా రవాణా జరిగి పోతుంది. కార్ల సంఖ్య రోడ్లపై తగ్గడంతో గాలి కాలుష్య తీవ్రత క్షీణించి మహానగరాల్లో పొగలు పలుచబడతాయని అర్థం అవుతున్నది. ఇటీవల కర్నాటక ప్రభుత్వం 300 బస్సులకు ఆర్డర్ చేయగా అందులో 75 ఈ-బస్సులను బెంగుళూరు నగరంలో ప్రవేశ పెట్టడం జరిగింది.

## అన్ని నగరాలకు విస్తరణ:

జీరో-ఉద్గార రవాణా వ్యవస్థలు ప్రోత్సహించడానికి శిలాజ ఇంధన వినియోగ వాహనాలకు బదులుగా ఎలక్ట్రిక్ వాహనాలను లేదా ఈ-వాహనాలను ప్రవేశ పెట్టడానికి పథక రచనలు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే 2021లో భారత్‌లో 2000 ఈ-బస్సుల కోసం ఆర్డర్లు ఇవ్వడం, తొలి దఫా ఈ-బస్సులు ముంబాయిలో తిరగడం ముదావహం. హిందుజా గ్రూప్ ఆఫ్ కంపెనీలు కూడా పర్యావరణహిత, గ్రీన్ బస్సుల తయారీలో చొరవ చూపిస్తున్నది. నేడు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు ఎలక్ట్రిక్ బస్సులు, ఇతర ప్రజారవాణ వాహనాలను రూపొందించి మార్కెట్‌లోకి విడుదల చేయడానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని భాధ్యతగల పౌరులు కోరుతున్నారు. పర్యావరణ కాలుష్యానికి ప్రధానమైన శిలాజ ఇంధన వాహనాలకు ప్రత్యామ్నాయంగా ప్రతి నగరంలో ఎలక్ట్రిక్ లేదా ఈ-వాహనాలు రావలసి ఉంది. ఈ నూతన డబుల్ డెక్కర్ ఈ-బస్సులు తేలికైన అల్యూమినియం బాడీ నిర్మాణంతో తక్కువ ఖర్చుతో అధిక రవాణా సామర్థ్యాన్ని కలిగి ఉండడం ప్రత్యేకమని, పర్యావరణహితమని వివరించబడింది. జీరో-కార్బన్ ఉద్గార లక్ష్యాలను చేరడానికి ప్రజారవాణ రంగంలో ప్రస్తుత శిలాజ ఇంధన వాహనాలకు బదులు అధిక సంఖ్యలో ఎలక్ట్రికల్ వాహనాలు రావలసి ఉంటుంది. జీరో-ఉద్గార వాహనాల రాకతో మహానగరాల్లోని గరళ గాలులు పలుచబడి, ఆరోగ్యవంతమైన గాలులతో నగర ప్రజారోగ్యం కుదుటపడాలని ఆశిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# జమ్ము & కాశ్మీర్‌లోని కాత్రాలో ఇంటర్ మోడల్ స్టేషన్‌ను అభివృద్ధి చేసేందుకు అవగాహనా ఒప్పందం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ, కేంద్ర సహాయ మంత్రి శ్రీ జనరల్ వికె సింగ్, జమ్ము ఊ కాశ్మీర్ ఎల్.జి. శ్రీ మనోజ్ సిన్హా, కేంద్ర, రాష్ట్ర అధికారుల సమక్షంలో ఎన్‌హెచ్ఎల్ఎంఎల్ (నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్), కాత్రా డెవలప్‌మెంట్ అథారిటీ సంస్థలు అవగాహనా ఒప్పందంపై (ఎంఒయు) సంతకాలు చేశాయి.

.ఈ చొరవలో భాగంగా, మాతా వైష్ణో దేవి ఆలయాన్ని సందర్శించేందుకు వచ్చే యాత్రికుల ప్రయాణ అనుభవాన్ని మెరుగుపరిచేందుకు కాత్రా వద్ద ఇంటర్ మోడల్ స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ప్రయాణీకులు మౌలిక సదుపాయాల అభివృద్ధిని మెరుగుపరిచేందుకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ నేతృత్వంలో ప్రభుత్వం దేశంలో పలు ప్రాంతాలలో ఇంటర్ మోడల్ స్టేషన్‌లను అభివృద్ధి చేస్తోంది.

# నిషేధిత గుట్కా ప్యాకెట్ల పట్టివేత



వరంగల్, సెప్టెంబర్ 2: ప్రభుత్వ నిషేధిత పొగాకు ఉత్పత్తులను నిల్వచేసిన వారిని టాస్కోఫోర్స్ పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. నమ్మదగిన సమాచారం ఓ కిరాణ షాపులో పోలీసులు తనిఖీలు చేయగా ప్రభుత్వ నిషేధిత అంబర్, జెకె జర్దా, బ్లాక్ బాబా, స్వాగత్, ఆర్ ఆర్ , వీ-1 ప్యాకెట్స్ స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.24,250/- ఉంటుందన్నారు. దుకాణం నిర్వహిస్తున్న వల్లాల సూర్య ప్రకాష్ ను విచారించగా తాను చక్కిలం రాజగోపాల్ వద్ద నిషేధిత పొగాకు ఉత్పత్తులను కొనుగోలు చేశానని వాంగ్మూలం ఇచ్చారు. ఈ మేరకు అతనిని కూడా అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. పై ఇద్దరిపై చట్టరీత్య చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# ఏపీలో రైతు ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలి: సోమిరెడ్డి

అమరావతి, సెప్టెంబర్ 2: ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం చేపడుతున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల రైతు ఆత్మహత్యలు గణనీయంగా పెరిగాయని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపించారు. గత ఏడాదితో పోల్చితే 14.5 శాతం రైతు ఆత్మహత్యలు రాష్ట్రంలో పెరిగిపోయాయని విమర్శించారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకూ జరిగిన 8067 ఆత్మహత్యల్లో 5677 ఆత్మహత్యలు వ్యవసాయం, వ్యవసాయ అనుబంధరంగాల వారివే అని పేర్కొన్నారు.

వీటిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను వైసీపీ నాయకులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తూ కోట్లు గడిస్తున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే మద్య నిషేదం అమలు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం మద్యం దళారులతో మిలాఖతై వారితో విషపూరిత మద్యం తయారు చేయించి ప్రజలకు అందిస్తూ రూ. 5వేల కోట్ల ఆదాయం పెంచుకున్నారని మండిపడ్డారు.




# గత 8 ఏళ్లలో ప్రధానమంత్రి మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలు ఎలాంటి ఓటు బ్యాంకు లేకుండా పేదలకు చేరాయి: కేంద్రమంత్రి డా.జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: కేంద్ర సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) సైన్స్ ఉ టెక్నాలజీ; సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) ఎర్త్ సైన్సెస్, పీఎంవో, పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్లు, అణుశక్తి మరియు అంతరిక్ష శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, గత 8 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ సంక్షేమ పథకాలు ఎలాంటి ఓటు బ్యాంకును పరిగణనలోకి తీసుకోకుండానే పేదలకు చేరాయని అన్నారు.

ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురిలో "లాభర్తీలు" (లబ్దిదారులు), పీఆర్ఐలు, డీడీసీలు, బీడీసీలు, మున్సిపల్ కౌన్సిల్ చైర్‌పర్సన్లు, సభ్యులతో వివిధ సమావేశాలను ఉద్దేశించి డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడారు. కులం, మతం, వర్గంతో గానీ, ఓటుతో సంబంధం కానీ లేకుండా దేశంలోని చిట్టచివరి వ్యక్తికి, నిరుపేదల కోసం, కేంద్ర ప్రభుత్వం వివిధ ప్రజా సంక్షేమ పథకాలు రూపొందించినట్లు మంత్రి తెలిపారు. ఇది దీన్ దయాళ్ ఉపాధ్యాయ యొక్క అంత్యోదయ తత్వానికి పూర్తిగా అనుగుణంగా ఉందని, అంటే చివరి వ్యక్తిని చేరుకోవడం అని ఆయన అన్నారు.

2014 మేలో మోదీ బాధ్యతలు చేపట్టేనాటికి దేశ జనాభాలో దాదాపు సగం మందికి మరుగుదొడ్లు, గృహాలు, టీకాల అందుబాటు, విద్యుత్ కనెక్షన్లు, బ్యాంకు ఖాతాలు వంటి సౌకర్యాలు లేవని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. సబ్‌కా ప్రయాస్ నినాదంతో గత 8 ఏళ్లలో కేంద్రం అనేక పథకాలను నూరు శాతం సంతృప్తతకు చేరువ చేసిందని, రానున్న 25 ఏళ్ల అమృత్‌కాల్‌లో భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా మార్చాలనే నవసంకల్పం ఉందని ఆయన అన్నారు.

ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పీఎం-జీకేఏవై), పీఎం ఆవాస్ యోజన, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన, హర్ ఘర్ జల్, ఉజ్వల, సౌచలయ, జన్ ధన్, ఆయుష్మాన్ వంటి పౌర పథకాలు ప్రతి ఇంటికి చేరాయని డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు. ఎటువంటి రాజకీయాలకు తావు లేకుండా "సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ సబ్ కా ప్రయాస్" అనే సూత్రాన్ని అనుసరించడం ద్వారా సమాజంలోని పేద, వెనుకబడిన వర్గాలను చేసుకోవడానికి అత్యంత జాగ్రత్తలు తీసుకున్నారు. గతంలో మభ్యపెట్టే విధానం విచ్చలవిడిగా సాగిందని, నేడు ఎలాంటి వివక్ష లేకుండా సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్నాయన్నారు. ఈ సంక్షేమ చర్యలు కోట్లాది మందిని కడు పేదరికం బారి నుంచి బయటకు తీసుకొచ్చి గౌరవప్రదమైన జీవితాన్ని ఇచ్చిందని మంత్రి ఉద్ఘాటించారు.

పంచాయతీరాజ్ సంస్థలు (పీఆర్ఐలు), వాటి ప్రతినిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంక్షేమ పథకాలకు అవసరమైన వార్తాహరులుగా అభివర్ణించిన కేంద్ర మంత్రి, సర్పంచులతో పాటు బ్లాక్ మరియు జిల్లా కౌన్సిల్‌లలో ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ప్రత్యేక పాత్ర పోషించే అవకాశం ఉందని అన్నారు. గత ఎనిమిదేళ్లలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పేద ప్రజలకు అనుకూలమైన, ప్రజా సంక్షేమ పథకాలు దేశంలోని చిట్టచివరి వ్యక్తికి ఈ ప్రయోజనాలు అందించాలన్నదే ప్రధాని లక్ష్యమని అన్నారు.

పంచాయతీరాజ్ సంస్థల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులను ఉద్దేశించి డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడారు. ప్రధాని నవ భారతదేశానికి వారే నిజమైన వార్తాహరులని పీఆర్ఐలను ఉద్దేశించి అన్నారు. పిఎం ఆవాస్ యోజన, ఉజ్వల, పీఎం గరీబ్ కళ్యాణ్ యోజన, ఆయుష్మాన్, ఖఓ కిసాన్ సమ్మాన్ నిధి, స్వచ్ఛత మరియు స్వచ్ఛమైన తాగునీరు వంటి పథకాల ప్రయోజనం పొందకుండా ఏ అర్హుడిని కూడా విడిచిపెట్టకుండా చూసుకోవాలని వారిని కోరారు. పేదల సంక్షేమం కోసం ప్రతి పథకంలో ఎవరూ వెనుకంజ వేయకుండా జిల్లా యంత్రాంగంతో సమన్వయంతో పని చేయాలని సూచించారు.

గత ఎనిమిదేళ్లలో మోడీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనుల గురించి, జాతీయ స్థితిని నిరాశావాదం నుండి ఆశావాదానికి ఎలా మార్చింది అనే దాని గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేయాలని డాక్టర్ జితేంద్ర సింగ్ ఎన్నికైన ప్రతినిధులను కోరారు. మోదీ ప్రభుత్వంపై ఇప్పటి వరకు ఒక్క అవినీతి ఆరోపణలు కూడా లేవని, పారదర్శకమైన పరిపాలన అందించడంలో ప్రధానమంత్రి విజయం సాధించారని మంత్రి ఉద్ఘాటించారు.

# పెన్షనర్ల సులభతరం జీవనం "ఈజ్ ఆఫ్ లివింగ్" కోసం ఇంటిగ్రేటెడ్ పెన్షనర్స్ పోర్టల్‌ను అభివృద్ధి చేయనున్న పెన్షన్, పెన్షనర్ల సంక్షేమ శాఖ




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: కేంద్ర ప్రభుత్వ పెన్షన్, పెన్షనర్ల సంక్షేమ శాఖ (డిఓపీపీడబ్ల్యూ) కార్యదర్శి శ్రీ వి శ్రీనివాస్ ఈ రోజు రెండు రోజుల బ్యాంకర్ల అవగాహన కార్యక్రమాన్ని అమృత్‌సర్‌లో ప్రారంభించారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు సీజీఎం శ్రీ గౌరీ ప్రసాద్ శర్మ, డిఓపీపీడబ్ల్యూ జాయింట్ సెక్రటరీ శ్రీ ఎస్ ఎన్ మాథుర్, సీపీఏఓ సీసీపీ శ్రీ భూపాల్ నందా, పంజాబ్ నేషనల్ బ్యాంకు జీఎం శ్రీ పర్వీన్ గోయల్, ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. సి;పీపీసిలు, పెన్షన్ వ్యవహారాలు చూసే 50 మందికి పైగా అధికారులు ఈ 2-రోజుల కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

పెన్షనర్లకు ఇబ్బందులు లేకుండా అందించే సేవలు, వాటి అనుభవాలను శ్రీ వి శ్రీనివాస్, తన ప్రారంభోపన్యాసంలో వివరించారు. ఇంటిగ్రేటెడ్ పెన్షనర్స్ పోర్టల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పెన్షన్, పెన్షనర్స్ వెల్ఫేర్ పోర్టల్ భవిష్య, వివిధ బ్యాంకుల పెన్షన్ పోర్టల్‌లను లింక్ చేయడం, పెన్షనర్లు, ప్రభుత్వం, బ్యాంకర్‌ల మధ్య అరమరికలు లేని పరస్పర అవగాహనను, సంభాషణను చేసుకోడానికి ఒక వ్యవస్థ రూపకల్పన జరగడం గురించి ఆయన వివరించారు.

శ్రీ శ్రీనివాస్ మాట్లాడుతూ, పిఎన్‌బితో పాటు ఇతర బ్యాంకుల సహకారంతో డిజిటల్ సిస్టమ్‌లను రూపొందించడానికి డిపార్ట్‌మెంట్ మొదటి డెలివరీబుల్స్‌గా సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు. పిఎన్‌బి ద్వారా ప్రక్రియ, వ్యక్తులకు సంబంధించిన ఫిర్యాదులపై అత్యంత శ్రద్ధ తీసుకుంటున్నారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ 2014లో ప్రారంభమైంది. ఇది ఆధార్ ఆధారిత బయో-మెట్రిక్ పరికరాలు, ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ కి చెందిన 1,90,000 గ్రామీణ డాక్ సేవక్స్, బ్యాంకుల ద్వారా డోర్‌స్టెప్ బ్యాంకింగ్ ద్వారా అందుబాటులో ఉంటుంది. ఫేస్ అథెంటికేషన్ టెక్నాలజీ నవంబర్, 2021లో ప్రారంభమైంది. ఇది పెన్షనర్లు వారి లైఫ్ సర్టిఫికేట్‌ను సమర్పించే విధానాన్ని మారుస్తుంది. ఫిన్‌టెక్‌ని చాలా పెద్ద పద్ధతిలో ఉపయోగించడం వల్ల పెన్షనర్‌ల జీవన ప్రమాణాలు పెరుగుతాయి.

పెన్షనర్లు మరియు కుటుంబ పింఛనుదారుల "ఈజ్ ఆఫ్ లివింగ్"ని పెంపొందించడానికి, కేంద్ర ప్రభుత్వం పెన్షన్, పెన్షనర్స్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, పెన్షన్ సంబంధిత ప్రక్రియల డిజిటలైజేషన్‌లో అనేక సంక్షేమ చర్యలు ఇన్పెన్షన్ పాలసీని చేపట్టింది. పెన్షన్ నియమాలలో అనేక సవరణలు జరిగాయి. గత 50 సంవత్సరాలలో అనేక స్పష్టమైన ఆదేశాలు/సూచనలు జారీ అయ్యాయి. వీటిని డిసెంబర్, 2021లో సెంట్రల్ సివిల్ సర్వీస్ (పెన్షన్) రూల్స్, 2021గా సంకలనం చేశారు. ప్రధాన పెన్షన్ పంపిణీ అధికారులు బ్యాంకులు కాబట్టి, పెన్షన్, పెన్షనర్ల సంక్షేమ శాఖ (డిఓపీపీడబ్ల్యూ) దీని కోసం అవగాహన కార్యక్రమాల శ్రేణిని ప్రారంభించింది. సెంట్రల్ పెన్షన్ ప్రాసెసింగ్ సెంటర్‌లు, బ్యాంక్‌లో పెన్షన్ సంబంధిత పనిని నిర్వహిస్తున్న ఫీల్డ్ ఫంక్షనరీలు. ఈ కార్యక్రమాల లక్ష్యం కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు పెన్షన్ పంపిణీకి సంబంధించిన వివిధ నియమాలు, విధానాలపై అవగాహన కల్పించడంతోపాటు పాలసీ, విధానాలలో వివిధ సవరణల ద్వారా ఎప్పటికప్పుడు జరిగే మార్పుల గురించి క్షేత్రస్థాయి కార్యకర్తలకు తెలియజేయడం. ఈ ప్రక్రియల నిర్వహణలో బ్యాంక్ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలు, పెన్షనర్ల ఫిర్యాదులను అర్థం చేసుకోవడం కూడా కార్యక్రమం ఉద్దేశ్యం. లైఫ్ సర్టిఫికేట్‌ల సమర్పణలో పెన్షనర్లు, బ్యాంకులకు డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్, ఫేస్ అథెంటికేషన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్. ఈ అవగాహన కార్యక్రమాలు బ్యాంకు అధికారులకు భారీ సామర్థ్య నిర్మాణ వ్యాయామంగా ఉపయోగపడతాయి. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు బ్యాంకు అధికారులకు, పెన్షనర్లు/కుటుంబ పింఛనుదారులకు చాలా ఉపయోగకరంగా ఉంటాయని భావిస్తున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు అధికారుల కోసం ఇటువంటి మొదటి కార్యక్రమం ఆగస్ట్ 30, 31 తేదీల్లో అమృత్‌సర్‌లో నిర్వహిస్తున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ సహకారంతో దేశవ్యాప్తంగా నాలుగు అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇదే తరహాలో, 2022-23లో ఇతర పెన్షన్ పంపిణీ బ్యాంకుల సహకారం తో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

# పిడుగుపాటుకు మహిళ మృతి

మచిలీపట్నం, సెప్టెంబర్ 2: పొలం పనులు చేసుకుంటున్న క్రమంలో పిడుగుపాటుకు మహిళ మృతి చెందిన సంఘటన మచిలీపట్నం, కాలేఖాన్ పేటలో చోటు చేసుకుంది. పొలంలో మహిళలు కలుపు తీస్తుండగా పిడుగు పడి మహిళ మృతి చెందగా, ఆమెతో పాటు మరో ఆరుగురికి గాయాలయ్యాయి. పిడుగుపాటుకు గురైన బాధితులంతా బందరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతున్న ఆరుగురిలో మరో మహిళ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతురాలు కాలేఖాన్ పేటకు చెందిన అర్జా సీతారావమ్మ (35)గా గుర్తించారు.

# కామారెడ్డి జిల్లా కలెక్టర్‌పై నిర్మలా సీతారామన్ ఫైర్



కామారెడ్డి, సెప్టెంబర్ 2: (నేటినిజం ప్రతినిధి): కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి జిల్లాలో పర్యటిస్తున్నారు. జిల్లాలోని బీర్కూర్ లో రేషన్ షాపును నిర్మలా సీతారామన్ తనిఖీ చేశారు. రేషన్ బియ్యంలో కేంద్రం వాటా ఎంత అని కలెక్టర్ జితేష్ పాటిల్ ను ఆమె ప్రశ్నించారు. దీనికి కలెక్టర్ తెలియదని సమాధానమిచ్చారు. కలెక్టర్ అయ్యుండి తెలియదంటారా అని నిర్మలా సీతారామన్ కలెక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అరగంటలో తెలుసుకుని చెప్పాలని కలెక్టర్ ను ఆదేశించారు. అలాగే రేషన్ షాపులో ప్రధాని మోడీ ఫోటో లేకపోవడాన్ని నిర్మలా సీతారామన్ గమనించారు. మోడీ ఫోటో ఎందుకు పెట్టలేదని కలెక్టర్ ను ఆమె ప్రశ్నించారు. మోడీ ఫ్లెక్సీ పెట్టకపోతే సాయంత్రం నేనే వచ్చి కడతానని నిర్మలా సీతారామన్ తెలిపారు. 2020 మార్చి నుంచి పేదలకు కేంద్రమే ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోందని ఆమె తెలిపారు.

# గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఉప్పల శ్రీనివాస్ గుప్తా



హైదరాబాద్, సెప్టెంబర్ 2: హైదరాబాద్ హిమాయత్ నగర్ లోని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ కార్యాలయంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండి మనోహర్, తెలంగాణ హరిత హోటల్స్ జిఎం.కె నాథన్, శాంతి, నర్సింహ్మారావు, రవీందర్ నాయక్, అంజిరెడ్డి, పట్టాభి, లక్ష్మరావు, ఓం ప్రకాష్, రాజేశ్వర్, మహేష్, రామకృష్ణ, హనుమంత్ రెడ్డి, శివ, సమ్మయ్య, రాజేష్, మహేష్, సుభాష్, సునంద, మధుర, హెచ్ఓడీస్, టీఎస్ టీడీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై టీటీడీకి మించి ఏర్పాట్లు : ఏపీ మంత్రి

అమరావతి, సెప్టెంబర్ 2: విజయవాడలో వెలసిన దుర్గమ్మ ఆలయంలో దసరా నవరాత్రుల సందర్భంగా వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఇంద్ర కీలాద్రికి వచ్చే భవాని భక్తులు ఇబ్బందులు పడకుండా ఇప్పటి నుంచే ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఇవాళ ఉత్సవాల ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే అన్ని మార్గాల్లో ఏర్పాట్లను సీపీ కాంతి రాణా, కలెక్టరు ఢిల్లీ రావుతో కలిసి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ ఆలయంలో మానవ వనరుల లేకపోయినా టీటీడీకి మించిన ఏర్పాట్లను చేస్తున్నామని వివరించారు. ఎమ్మెల్యేలకు ప్రోటోకాల్ ప్రకారం 10 లెటర్స్, బ్రేక్ దర్శనానికి ఐదుగురికి అనుమతిస్తామని తెలిపారు. ప్రోటోకాల్ ప్రకారం వీఐపీలకు దర్శనం కల్పించే ఏర్పాట్లను, బ్రేక్ దర్శనాల కోసం ప్రత్యేక పోర్టల్ ను ఏర్పాటు చేస్తామన్నారు.

లోకల్ ఎమ్మెల్యేలకు ప్రోటోకాల్ పరిధి పెంచుతామన్నారు. భవానీ భక్తుల కోసం టీటీడీ స్థలంలో తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేస్తామని ఆయన ప్రకటించారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం కొండపైకి బ్యాటరీ వెహికల్స్‌పై దర్శనానికి అనుమతిస్తామని మంత్రి అన్నారు.

# వరద ఉధృతికి కొట్టుకుపోయిన గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటు

అమరావతి, సెప్టెంబర్ 2: ప్రకాశం జిల్లాలో ఉన్న గుండ్లకమ్మ ప్రాజెక్టుకు ఎగువ భాగాన నుంచి వస్తున్న వరద నీటితో ప్రాజెక్టుకు చెందిన మూడో గేటు వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది . గత రెండు రోజుల నుంచి ఈ గేటు మరమ్మతుకు గురికావడంతో దిగువనకు నీరు వృధాగా పోతోంది. గేటు మరమ్మతులకు అధికారులు చేసిన ప్రయత్నాలు విఫలం స్టాప్ లాక్ ద్వారా నీటిని ఆపేందుకు ఇంజనీర్లు చేసిన ప్రయత్నం విఫలమైంది. దీంతో 13, 14, 15 గేట్లు ఎత్తి ప్రాజెక్టులో నీటి వత్తిడిని అధికారులు తగ్గించారు. ఇప్పటికే 12వేల క్యుసెక్కుల నీరు సముద్రం పాలైందని అధికారులు తెలిపారు. దీర్ఘకాలంగా గేట్ల నిర్వహణ, మరమ్మతుల్లో జరుగుతున్న నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు ఇరిగేషన్‌కు చెందిన మాజీ అధికారులు తెలిపారు.

# అరహులైన ప్రతి పేదవారికి ఆసరా పింఛన్లు అందిస్తాం మంత్రి మల్లారెడ్డి



మేడ్చల్, సెప్టెంబర్ 2(నేటి నిజం ప్రతినిధి) :–శామీర్పేట్ మండలం అలియాబాద్ శుభం గార్డెన్ లో జరిగిన శామీర్పేట్ మండలంకు మంజూరు అయినా 57 ఏళ్ళు వారికీ నూతనంగా ఆసరా పెన్షన్, మరియు దివ్యంగా పెన్షన్ , గీతా కార్మికులకు మంజూరు అయినా 950మంది లబ్ధిదారులకు ఆసరా పెన్షన్ కార్డులను మంత్రివర్యులు మల్లారెడ్డి గారు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ శరత్ చంద్ర రెడ్డి గారు, ఎంపీపీ ఎల్లుబాయ్,జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేష్,జడ్పీటీసీ అనిత, డీసీఎంస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, కో అప్షన్ సభ్యులు, అధికారులు, నాయకులు, మండల తెరాస పార్టీ అధ్యక్షులు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి కేసీఆర్ : ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మెదక్, సెప్టెంబర్ 2 : నేటినిజం (ప్రతినిధి): గత ప్రభుత్వాల హయాంలో నిరాదారణకు గురైన పల్లెలు నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు మండల పరిధిలోని పాటి, కర్ధనూరు, నందిగామ, ఘనాపూర్, భానూరు, క్యాసారం, ఇస్నాపూర్, పాశమైలారం గ్రామాల పరిధిలో రూ.రెండు కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువలు, మహిళా సమాఖ్య భవనం తదితర పనులకు స్థానిక ప్రజాప్రతినిదులతో కలిసి శంకుస్థాపన చేశారు. కర్ధనూరు, నందిగామ, భానూరు, ఇస్నాపూర్ గ్రామాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన వైకుంఠ రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాల హాయంలో లక్ష రూపాయల నిధుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని, నేడు ప్రతి గ్రామంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంతో పాటు, రాజకీయాలకు అతీతంగా పనులు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి ప్రభుత్వం తరఫున సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. నిరుపేద ప్రజల కోసం వైకుంఠ రథాలు, ఫ్రీజర్ బాక్స్ లు అందించిన దాతలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వ్యక్తి మరణించినప్పుడు అంతక్రియలు ఇబ్బంది కాకూడదని ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి గ్రామంలో వైకుంఠధామాలు నిర్మించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, జడ్పిటిసి సుప్రజా వెంకట్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు పాండు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల స్థలాల కోసం కలెక్టర్‌ను కలిసిన జర్నలిస్టుల సంఘం



మహబూబాబాద్, సెప్టెంబర్ 2: (నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ కె.శశాంక ను పెద్దవంగర జర్నలిస్టుల సంఘం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా కొన్ని సంవత్సరాల నుంచి పెద్దవంగర మండలంలో వివిధ పత్రికలకు జర్నలిస్టులుగా పని చేస్తూ ఇటు ప్రభుత్వానికి అటు ప్రజలకు వారధిగా ఉంటూ, ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి, అధికారుల దృష్టికి, ప్రజా ప్రతినిధుల దృష్టికి, తీసుకు వెళ్లడంలో కీలక భూమిక వహిస్తున్న జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ శుక్రవారం కలెక్టర్ ను కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ మీ అందరికీ ఇళ్ల స్థలాలు వచ్చేలా కృషి చేస్తాననీ హామీ ఇచ్చారు . జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భద్రయ్య చారి , ఉపాధ్యక్షుడు సదానందం , ప్రధాన కార్యదర్శి బాలాజీ నాయక్ ,, కోశాధికారి వేణు , కార్యవర్గ సభ్యులు మధు, నవీన్, ఐలయ్య, యాకన్న, రాజు, రామ్మూర్తి తదితరులు ఉన్నారు

# తూనికలు కొలతల పరికరాల తయారీదారులు/దిగుమతిదారులకు ధృవీకరణ వివరాలను కోరుతూ కేంద్రం 63 షోకాజ్ నోటీసులు జారీ చేసింది

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: కేంద్రం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ మెట్రాలజీ ద్వారా తూనికలు కొలతల పరికరాల తయారీదారులు/దిగుమతిదారులకు ధృవీకరణ వివరాలను కోరుతూ 63 షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఇ–కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లలో తయారీదారులు/దిగుమతిదారులు/విక్రేతదారులకు, మోడల్ ఆమోదం, తయారీ/దిగుమతిదారు/డీలర్ లైసెన్స్ మరియు తూనిక ప్రమాణాల ధృవీకరణ వివరాలను కోరుతూ నోటీసులు జారీ చేసారు.

కొంతమంది తూనికలు కొలతల పరికరాల తయారీదారులు/దిగుమతిదారులు చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా ఇ–కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లలో బరువు యంత్రాలు, కిచెన్ స్కేల్స్ మొదలైన వాటిని విక్రయిస్తున్నట్లు గమనించబడింది. ఇ–కామర్స్ సైట్‌లలో ఇటువంటి అనధికారిక విక్రయాలు వినియోగదారునికి నష్టమే కాకుండా ప్రభుత్వ ఆదాయం కూడా కోల్పోతుంది.

వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడానికి మరియు ప్రభుత్వ ఆదాయానికి , తూనికలు కొలతల పరికరాల తయారీదారులు/దిగుమతిదారులు వారి తూనికలు కొలతల పరికరాల తయారీ లైసెన్స్ (సెక్షన్ 23)/ దిగుమతిదారు రిజిస్ట్రేషన్ (సెక్షన్ 19), మోడల్ (సెక్షన్ 22) ఆమోదం మరియు లీగల్ మెట్రాలజీ చట్టం, 2009 ప్రకారం తూనికలు కొలతల పరికరం ధృవీకరణ/స్టాంపింగ్ (సెక్షన్ 24) పొందవలసి ఉంటుంది.

వినియోగదారుల ప్రయోజనాల దృష్ట్యా తూనికలు కొలతల పరికరాల యొక్క ప్రీ ప్యాకేజీ/ఇ కామర్స్ ప్లాట్‌ఫారమ్‌పై ప్రకటనలు లీగల్ మెట్రాలజీ (ప్యాకేజ్డ్ కమోడిటీస్), 2011లోని నిబంధనల (రూల్ 6)కి అనుగుణంగా ఉండాలి. తూనికలు కొలతల పరికరాల నమూనా ఆమోదం, తయారీ లైసెన్స్/దిగుమతిదారు రిజిస్ట్రేషన్ మరియు పరీక్ష /స్టాంపింగ్ తూకం కొలిచే సాధనాలు మరియు తూకాలు, కొలతలు మరియు బరువు కొలమానం ద్వారా విక్రయించే ఇతర వస్తువుల వాణిజ్యాన్ని నియంత్రించడంతప్పనిసరి.

తూనికలు కొలతల పరికరాల లేదా సంఖ్య కొలిచే సాధనాల నమూనా ఆమోదం, తయారీ లైసెన్స్/దిగుమతిదారు రిజిస్ట్రేషన్ మరియు తూకం, కొలిచే సాధనాల పరీక్ష/స్టాంపింగ్ వినియోగదారుల ప్రయోజనాల దృష్ట్యా అవసరం. బరువు కొలత ద్వారా విక్రయించే తూకాలు, కొలతలు మరియు ఇతర వస్తువుల వాణిజ్యాన్ని నియంత్రించడం, వినియోగదారులకు ప్యాకేజీ వస్తువు/ఇ–కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లో ఉత్పత్తి యొక్క ముందస్తు సమాచారం తప్పనిసరిగా ప్రకటించాల్సి ఉంటుంది.

తూనికలు కొలతల పరికరాల తయారీదారు/దిగుమతిదారు తయారు చేయబడిన/దిగుమతి చేయబడిన, విక్రయించబడిన/పంపిణీ చేయబడిన పరికరాల సంఖ్య మరియు వాటి భాగాలు మరియు ప్రభుత్వానికి చెల్లించిన ధృవీకరణ రుసుముల వివరాల రికార్డులను నిర్వహించవలసి ఉంటుంది.

లీగల్ మెట్రాలజీ చట్టంలోని ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే సెక్షన్ 32 (మోడల్ ఆమోదం పొందడంలో వైఫల్యం), సెక్షన్ 45 (లైసెన్స్ లేకుండా బరువు మరియు కొలతల తయారీకి జరిమానా), సెక్షన్ 38 (తూనికలు కొలతల పరికరాల దిగుమతి చేసుకునేవారు నమోదు చేయనందుకు జరిమానా), సెక్షన్ 33 (ధృవీకరించబడని బరువు లేదా కొలతను ఉపయోగించడం కోసం జరిమానా) మరియు సెక్షన్ 36 (ప్రామాణికం కాని ప్యాకేజీల విక్రయం, మొదలైనవి) ల కింద జరిమానా లేదా జైలు శిక్ష లేదా రెండూ విధించబడుతుంది.

# సెంట్రల్ పూల్ కోసం ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2022-23 ఖరీఫ్ పంట కాలంలో 518 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణ జరుగుతుందని అంచనా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: రానున్న ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2022-23లో ఖరీఫ్ పంట సేకరణకు సంబంధించిన ఏర్పాట్లపై కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఆహారం, ప్రజా పంపిణీ విభాగం కార్యదర్శి శ్రీ సుధాన్షు పాండే ఈ రోజు ఢిల్లీలో రాష్ట్ర ఆహార కార్యదర్శులు మరియు ఎఫ్‌సీఐ అధికారులతో చర్చలు జరిపారు.

సమావేశానికి ఆంధ్రప్రదేశ్, అస్సాం,బీహార్,ఛత్తీస్ ఘర్, గుజరాత్, హర్యానా, హిమాచల్ప్రదేశ్, జమ్మూకాశ్మీర్, ఝార్ఖండ్, కర్ణాటక, రాజస్థాన్, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, పంజాబ్, తమిళనాడు, తెలంగాణ, త్రిపుర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ముఖ్య కార్యదర్శి/కార్యదర్శి ( ఆహారం) లేదా వారి ప్రతినిధులు హాజరయ్యారు. ఎఫ్‌సీఐ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, ఎఫ్‌సీఐ ఉన్నతాధికారులు, ఆహారం, ప్రజా పంపిణీ, భారత తూనికలు విభాగం, వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

రానున్న ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2022-23 లో ఖరీఫ్ పంట కాలంలో దేశంలో 518 ఎల్ఎంటీ బియ్యం సేకరణ జరిగే అవకాశం ఉందని సమావేశం అంచనా వేసింది. 2021-22 ఖరీఫ్ పంట కాలంలో 509.83 ఎల్ఎం టీల బియ్యం సేకరణ జరిగింది.

పంట సేకరణలో యంత్రాలను ఉపయోగించడం,తక్కువ వడ్డీకి రుణాలు సమకూర్చడం, సేకరణ కార్యక్రమం ఖర్చు తగ్గించడం, వినూత్న సాంకేతిక అంశాలను ప్రవేశపెట్టడం, నాణ్యతా ప్రమాణాలు, చిరుధాన్యాలను ప్రోత్సహించడం,గోనె సంచుల అవసరాలు, ఆహార సబ్సిడీ అంశాలను ఆన్ లైన్ లో పరిష్కరించడం, తదితర అంశాలు సమావేశంలో చర్చకు వచ్చాయి. వినూత్న విధానాలకు ప్రోత్సాహకాలు అందించాలని సమావేశం నిర్ణయించింది. చిరుధాన్యాల సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని శ్రీ పాండే సూచించారు. 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరంగా పాటించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా చిరు ధాన్యాల సేకరణ పెరగాలని అన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులు కారణంగా గోధుమ, వరి దిగుబడి తగ్గుతున్నదని అన్నారు. 2022-23 ఖరీఫ్ పంట కాలంలో రాష్ట్రాలు 13.70 ఎల్ఎంటీల "సూపర్ ఫుడ్" చిరు ధాన్యాలు సేకరించాలని సూచించారు. ప్రస్తుత సేకరణ కాలంలో ఇంతవరకు 6.30 ఎల్ఎంటీల చిరు ధాన్యాల సేకరణ జరిగింది.

ప్యాకేజింగ్ మెటీరియల్ కొరతను ఆహారం, ప్రజా పంపిణీ విభాగం కార్యదర్శి సమావేశంలో ప్రముఖంగా ప్రస్తావించారు. ప్యాకేజింగ్ సామగ్రిని సమకూర్చడం సమస్యగా మారిందని అన్నారు. కేవలం 50% అవసరాలను మాత్రమే జూట్ మిల్లులు తీరుస్తున్నాయని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి స్మార్ట్ గోనె సంచుల తయారీ లాంటి ఉత్పత్తులను అభివృద్ధి చేసే అంశంపై దృష్టి సారించామని తెలిపారు. స్మార్ట్ గోనె సంచుల సామర్థ్యం, నాణ్యత పరీక్షలు విజయవంతం అయ్యాయని తెలిపారు.

# విపత్తు నిర్వహణ & సంసిద్ధత కోసం సీఏపీ ఆధారిత ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ అలర్ట్ సిస్టమ్‌పై వర్క్‌షాప్ నిర్వహించనున్న ఎన్ డీఎంఏ - డిపార్ట్మెంట్ ఆఫ్ టెలికం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: విపత్తు నిర్వహణ కోసం సీడాట్(సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్), డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (డాట్), మినిస్ట్రీ ఆఫ్ కమ్యూనికేషన్స్, భారత ప్రభుత్వం (ఎన్ డీఎంఏ) నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ, భారత ప్రభుత్వం సంయుక్తంగా ఆల్ ఇండియా వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నాయి. కామన్ అలర్ట్ ప్రోటోకాల్ (సీఏపీ) ఆధారిత ఇంటిగ్రేటెడ్ అలర్ట్ సిస్టమ్‌పై ప్రధానాంశంగా నిర్వహించే ఈ కార్యక్రమం 31 ఆగస్టు 2022న జరుగుతుంది. ఈ వర్క్‌షాప్ భారతదేశంలోని సంబంధిత విభాగాలు వివిధ విపత్తు నిర్వహణ ఏజెన్సీలకు వారి అంతర్లీన సమస్యలు, సవాళ్లను చర్చించడానికి ఒక వేదికను అందించడం జరుగుతుంది. నిపుణులు సాంకేతిక నిపుణుల బృందం చర్చల ద్వారా సమర్థవంతమైన పద్ధతిలో వీటిని పరిష్కరించడానికి సాంకేతిక ఆధారిత పరిష్కారాలను రూపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమానికి అజయ్ కుమార్ భల్లా, ఐఏఎస్, హోం సెక్రటరీ, హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ), భారత ప్రభుత్వం ముఖ్య అతిథిగా కే. రాజారామన్, ఐఏఎస్, చైర్మన్, డిజిటల్ కమ్యూనికేషన్ కమిషన్ సెక్రటరీ (టెలికాం), భారతదేశం గౌరవ అతిథిగా పాల్గొంటారు. ఎన్ డీఎంఏ, డిపార్ట్మెంట్ ఆఫ్ టెలికం, ఇండియన్ రైల్వేస్, ఇండియన్ మెట్రాలాజికల్ డిపార్ట్‌మెంట్ (ఐఎండీ), సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఐఎన్సీఓఐఎస్ ), డిఫెన్స్ జియోఇన్ఫర్మేటిక్స్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (డీజీఆర్ఈ) సహా వివిధ ప్రభుత్వ శాఖల నుండి వివిధ ప్రముఖ ప్రముఖులు, వక్తలు ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ), ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) 36 రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీలు ( డీఎంఏ) అధికారులు ఈ వర్క్‌షాప్‌కు హాజరవుతారు. విపత్తు నిర్వహణ సంసిద్ధతకు సంబంధించిన వివిధ సమకాలీన అంశాలపై, ఇతివృత్తాలపై చర్చిస్తారు.

**ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ అలర్ట్ సిస్టమ్– గురించి**

ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ అలర్ట్ సిస్టమ్– అనేది ఐటీయూ కామన్ అలర్టింగ్ ప్రోటోకాల్ (సీఏపీ) ఆధారంగా ముందస్తు హెచ్చరిక ప్లాట్‌ఫారమ్. సమర్థవంతమైన విపత్తు నిర్వహణ కోసం సీడాట్ దీనిని అభివృద్ధి చేసింది. వరదలు, తుఫానులు కోవిడ్ మహమ్మారి వంటి అత్యవసర సమయాల్లో అందుబాటులో ఉన్న అన్ని మీడియాలో ప్రజలకు హెచ్చరికలు, సలహాలు ఇతర ఉపయోగకరమైన సమాచారాన్ని వ్యాప్తి చేయడానికి జాతీయ రాష్ట్ర విపత్తు నిర్వహణ అధికారులు ఈ ప్లాట్‌ఫారమ్‌ను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఇది ఎస్ఎంఎస్ ద్వారా స్థానిక భాషలలో ప్రజలకు లక్ష్య హెచ్చరికల వ్యాప్తి కోసం ఒక కన్వర్జ్ ప్లాట్‌ఫారమ్‌ను అందిస్తుంది. విపత్తు రిస్క్ తగ్గింపు కోసం ప్రధానమంత్రి 10 పాయింట్ల ఎజెండాను అమలు చేయడంలో వన్ స్టాప్ పరిష్కారం. పోర్టల్ మొబైల్ అప్లికేషన్, సెల్ బ్రాడ్‌కాస్ట్, రేడియో, టీవీ, సైరన్, సోషల్ మీడియా, వెబ్‌తో సహా అందుబాటులో ఉన్న అన్ని కమ్యూనికేషన్ మీడియాల్లో త్వరలో సందేశాలను పంపిస్తారు. ఈ వ్యవస్థ ఇప్పటికే 34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో పనిచేస్తోంది. తుఫానులు (అసాని, యాస్, నివార్, అంఫాన్), వరదలు (అస్సాం, గుజరాత్), మెరుపులు (బీహార్) మొదలైన వివిధ విపత్తుల సమయంలో సిస్టమ్ ద్వారా ఇప్పటికే 75 కోట్లకు పైగా ఎస్ఎంఎస్లు వెళ్లాయి. అమర్‌నాథ్ యాత్రలో యాత్రికుల కోసం కూడా ఈ వ్యవస్థను

# అర్హులందరికీ పింఛన్లు అందిస్తాం : ఎమ్మెల్యే చల్లా



వరంగల్, సెప్టెంబర్ 2: పరకాల మండలం వెల్లంపల్లి గ్రామంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పర్యటించారు. పర్యటనలో భాగంగా గ్రామంలో రూ.20 లక్షలతో నూతన మహిళ భవన నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేయడం జరిగింది. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటుచేసిన చేసిన గ్రామ సభలో వెల్లంపల్లి, పోచారం గ్రామాలలో నూతనంగా మంజూరైన ఆసరా పెన్షన్ల గుర్తింపు కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ పెన్షన్ల అందిస్తాం. కొన్ని సాంకేతిక కారణాలవల్ల కొందరికి పెన్షన్లు రాలేదు. రానివారెవరు ఆందోళన చెందవద్దు. కరోనతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డ ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాల అమలు ఆపలేదన్నారు. ఆసరా పథకం ద్వారా వృద్ధుల ఆత్మగౌరవాన్ని పెంచిన ఘనత సీఎం కేసీఆర్ గారిదన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వకుండా, మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై కోర్టుకు పోయిన బీజేపీ నాయకులు గ్రామాలకు వస్తే నిలదీయాలన్నారు. నేడు రాష్ట్రంలో వ్యవసాయ రంగంతో పాటు, అన్ని రంగాలకు 24 గంటల కరెంటు సరఫరా చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్ ది. కానీ నేడు వ్యవసాయ బావుల వద్ద మీటర్లు బిగించి రైతును ఆగంచేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుంది.

పేదింటి ఆడబిడ్డ పెళ్లి ఆ కుటుంబానికి భారం కాకూడదనే మంచి ఆలోచనతో కళ్యాణలక్ష్మి/శాదిముబారక్ పథకం ప్రవేశపెట్టి రూ.100116/– అందిస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అన్నారు. దళితులను ఆర్థికంగా బలోపేతం చేసి వారి జీవితాల్లో వెలుగులు నిమపాలనే సీఎం కేసీఆర్ దళితబంధు పథకానికి శ్రీకారం చుట్టారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ బ్యాంకు ఖాతాల్లో వేస్తానన్న 15 లక్షలు, బయటికి తీస్తానన్న నల్లధనం ఇంతవరకు జాడలేదన్నారు. బ్యాంకు రుణాలు లక్షల కోట్లలో ఎగబెట్టి, బ్యాంకు లను మోసం చేసిన వారికి మాత్రం ప్రధాన మంత్రి మోదీ రుణమాఫీ చేశారు. దేశంలో కాంగ్రెస్, బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు అమలుచేసే దమ్ములేదు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ కు మద్దతుగా మనమంతా నిలవాలన్నారు.

# ఈ నెల 27నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు.. అక్టోబర్ 1న గరుడ సేవ!

తిరుమల, సెప్టెంబర్ 2: కరోనా మహమ్మారి రాకతో తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు భక్తులు లేకుండానే నిర్వహించారు. రెండేళ్ల తర్వాత భక్తుల సమక్షంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈనెల (సెప్టెంబరు) 27వ తేదీ నుండి అక్టోబరు 5వ తేదీ వరకు మాడ వీధుల్లో వాహనసేవలుంటాయని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. అదేవిధంగా సెప్టెంబరు 20వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, సెప్టెంబరు 26న అంకురార్పణ, అక్టోబర్ 1న గరుడ సేవ ఉంటుందన్నారు.

కొవిడ్ కారణంగా రెండేళ్లపాటు ఆలయంలో ఏకాంతంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈసారి మాడ వీధుల్లో వాహనసేవలు జరగనుండడంతో విశేషంగా భక్తులు విచ్చేసే అవకాశం ఉందని టీటీడీ అంచనా వేస్తోంది. ఈ క్రమంలో భక్తుల కోసం విస్తృతంగా ఏర్పాట్లు చేపడుతోంది. బ్రహ్మోత్సవాల్లో తొమ్మిది రోజుల పాటు జరగనున్న వాహనసేవల వివరాలు ఇలా ఉన్నాయి. సెప్టెంబరు 20న ఉదయం 6 నుంచి 11 గంటల మధ్య సంప్రదాయబద్ధంగా ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది.

# తూప్రాన్‌లో వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌ను ప్రారంభించిన మంత్రి హరీశ్ రావు



మెదక్, సెప్టెంబర్ 2 : నేటినిజం (ప్రతినిధి):ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచి, నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలనే ఉద్దేశంతో ప్రతి మున్సిపల్ కేంద్రంలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్లను ఏర్పాటు చేస్తున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిహరీశ్ రావు అన్నారు. శుక్రవారం తూప్రాన్ మున్సిపాలిటీలో రూ.11 కోట్ల వ్యయంతో నిర్మించిన వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్లను నిర్మిస్తున్నదని అన్నారు. ఇక్కడ ఏర్పాటుచేసిన మార్కెట్లో దుమ్ము, దూళి వంటివి ఆహార పదార్థాలపై పడకుండా నాలుగు ఫీట్ల ఎత్తున స్టాల్స్ ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. త్వరలో సూపర్ మార్కెట్ ఏర్పాటు చేస్తామని మంత్రి హామీనిచ్చారు. త్వరలో ఇక్కడ బ్యాంకు, ఏటీఎం సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. మార్కెట్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన హితవు పలికారు.

# అంగన్వాడీ టీచర్‌లకు టీఎన్జీవోస్ అండగా ఉంటోంది: అప్జల్ హసన్



ఖమ్మం, సెప్టెంబర్ 2: (నేటినిజం ప్రతినిధి): అంగన్వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీఎన్జీవోస్ అనుబంధ అంగన్వాడీ టీచర్లు వివిధ జిల్లాల అంగన్వాడి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ఆవరణలో ఉన్న టీఎన్జీవోస్ జిల్లా యూనియన్ కార్యాలయంలో శుక్రవారం టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు షేక్.అప్జల్ హసన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వి.ఎస్.సాగర్ లను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం ఇవ్వగా టీఎన్జీవోస్ యూనియన్ అంగన్వాడీ టీచర్లకు అండగా ఉంటోందని అప్జల్ హసన్ స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు మాట్లాడుతూ

అంగన్వాడీ టీచర్లను విద్యకు మాత్రమే పరిమితం చేయకుండా, ప్రభుత్వం అదనపు పని భారం మోపుతూ వెట్టి చాకిరి చేయిస్తోంది. రిటైర్మెంట్ బెనిఫిట్స్,జీతం లో సగభాగం.. వారసత్వ ఉద్యోగా డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా స్మార్ట్ ఫోన్ చేతికి ఇచ్చి బిఎల్ఓ గా, గ్రోత్ మానిటరింగ్ లాంటి అదనపు డ్యూటీ లు వేయడంతో, కొందరు టీచర్ లు వయో పరిమితి పెరగడం తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సినియార్టీ ఏజ్ ప్రకారం సూపర్ వైజర్ పోస్టు లు ఇవ్వాలని వారు కోరారు.

అనంతరం టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు అప్జల్ హసన్, స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20 లక్షల మంది అంగన్వాడీ టీచర్లు అదనపు పనిభారం తో బాధపడుతున్నారు. మీ సమస్యను జిల్లా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మరియు టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షులు మామిళ్ల రాజేందర్, రాష్ట్ర కార్యదర్శి రాయకంటి ప్రతాప్ ల సహకారం తో రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో అంగన్వాడీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా ప్రెసిడెంట్ నందగిరి శ్రీను, కల్లూరు యూనిట్ కార్యదర్శి సవర్జన్ పాల్, బుద్ధ రామకృష్ణ, అంగన్వాడీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు ప్రేమబాయ్, వాణి శ్రీ, ఎన్.రోజా, జయమ్మ, వెంకటరత్నం, శ్రీదేవి, కె.సునీత, తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పొంగులేటి పర్యటన



ఖమ్మం, సెప్టెంబర్ 2: (నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర నాయకులు, ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి ఖమ్మంజిల్లాలో శనివారం పర్యటించనున్నారు. ఈమేరకు పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంఛార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పర్యటనలో భాగంగా చంద్రుగొండ, ములకలపల్లి, దమ్మపేట, సత్తుపల్లి ప్రాంతాల్లో పర్యటిస్తారని తెలిపారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే పలు సాంస్కృతిక, పూజా, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. అదేవిధంగా పలు కుటుంబాలను పరామర్శిస్తారని తెలిపారు. కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై పొంగులేటి పర్యటనను విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.

# రక్షణ శాఖ పెన్షనర్లకు.. పింఛన్ల డిజిటల్ పంపిణీ 'స్పర్ష్' ద్వారా నమోదు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: డిజిటల్ ఇండియా చొరవకు ప్రోత్సాహాన్ని అందిస్తూ.. రక్షణ శాఖ 'సిస్టమ్ ఫర్ పెన్షన్స్ అడ్మినిస్ట్రేషన్ – రక్ష' లేదా 'స్పర్ష్' ద్వారా ఆగస్టు, 2022 నెలలో పెన్షనర్లకు రూ. 3,090 కోట్లకు పైగా పించన్లను డిజిటల్ రూపంలో పంపిణీ చేసింది. ఇదే క్రమంలో ఆగస్టు 2022 నెలలో మొత్తం 5,62,946 మంది రక్షణ శాఖ పెన్షనర్లు 'స్పర్ష్' డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లోకి విజయవంతంగా వచ్చి చేరారు. దీంతో స్పర్ష్ వేదికలో చేరిన మొత్తం పెన్షనర్ల సంఖ్య 11 లక్షలకు చేరింది. ఫలితంగా ఈ వేదికపై లబ్ధిదారుల సంఖ్య మిలియన్ మార్క్‌ను దాటినట్టయింది. ఇది భారతదేశంలోని మొత్తం రక్షణ శాఖ నుంచి పెన్షన్లను అందుకుంటున్న వారిలో దాదాపు 33% కావడం గమనార్హం. పెరుగుతున్న ఆవిష్కరణల ద్వారా మాత్రమే ఈ పరివర్తనాత్మక మార్పు సాధ్యమైంది. స్పర్ష్ అనేది పెన్షన్ క్లెయిమ్‌లను ప్రాసెస్ చేసే వెబ్ ఆధారిత వ్యవస్థ. ఎటువంటి బాహ్య మధ్యవర్తి లేకుండా నేరుగా రక్షణ శాఖ తన పెన్షనర్లకు బ్యాంక్ ఖాతాలలో పెన్షన్‌ను జమ చేస్తుంది. 2020–21 ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ. 57 కోట్లకు పరిమితమైన ఈ తరహా పంపిణీ.. 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ. 11,600 కోట్లకు చేరింది. మేటి వృద్ధిని నమోదు చేసింది. డిఫెన్స్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ అనేది ప్రాజెక్ట్ స్పర్ష్ యొక్క నోడల్ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ. ఇది 3000 పెన్షన్ ప్రారంభ, మంజూరు మరియు పంపిణీ ఏజెన్సీలను ఏకీకృతం చేస్తుంది. ఇది పెన్షనర్ వెరిఫికేషన్ యొక్క డిజిటల్ ప్రక్రియ నుండి ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించిన రియల్ టైమ్ ట్రాకింగ్ వరకు – అనుభవజ్ఞుల ద్వార ఇంటి వద్దకే పెన్షన్ సేవలను అందిస్తోంది.

# పెన్షన్ ధ్రువపత్రాలు పంపిణీ చేసిన ఎంపిపి, జెడ్పీటీసీ



మహబూబాబాద్, సెప్టెంబర్ 2: (నేటినిజం ప్రతినిధి): పెద్ద వంగర మండలంలోని వడ్డేకొత్తపల్లి, కోరిపల్లి, మొత్య తండా, పోచారం, ఆర్ సి తండా, ఆర్కే తండా ,బొమ్మకల్ గ్రామాలలో నూతనంగా మంజురు ఐనా ఆసరా పెన్షన్ లను ఆయా గ్రామాల సర్పంచ్ల అధ్యక్షతన ఎంపిపి ఈదురు రాజేశ్వరి, జెడ్పీటీసీ శ్రీరాం జ్యోతిర్మయి పంపిణి చేయడం జరిగింది. వారు మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్టంలో లేని విదంగా 57సంవత్సరాలు నిండిన వ్యక్తికీ వృద్ధాప్య పింఛన్లు ఇస్తున్నది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒకటే అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వేణుగోపాల్ రెడ్డి, సర్పంచ్లు కేతిరెడ్డి దీపిక సోమనరసింహ రెడ్డి,గాజుల శోభ, ధరావత్ భీమా, జాటోత్ చిలుకమ్మాహేమని, నునావత్ లక్ష్మిబాలు, ఇంచార్జి సర్పంచ్ మొర్రిగాడుదుల శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు ఎర్ర సభిత,బానోత్ రవీందర్,సాయిని ఝాన్సీ,తెరాస మండల పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థానం చైర్మన్ రాంచంద్రయ్య శర్మ, నాయకులు శ్రీరాం సుదీర్,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్,మాజీ ఎఫ్ఎసిఎస్ వైస్ చైర్మన్ ముత్తినేని శ్రీనివాస్ ,రైతు కోఆర్డినేటర్లు మల్లికార్జున చారి, బొమ్మిడి కృష్ణ రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్లు బానోత్ వెంకన్న, అనపురం రవి, గ్రామ పార్టీ అధ్యక్షులు ఆరుట్ల వెంకట్ రెడ్డి,కుమారస్వామి, కూకట్ల వీరన్న, రెడ్డబోయిన గంగాధర్,జాటోత్ దాస్రు,భూక్యా దాస్రు,అంగోత్ సీతారాం, మండల ప్రచార కార్యదర్శి పసులేటి వెంకట్రామయ్య, మండల బిసి సెల్ అధ్యక్షులు బండారి వెంకన్న,కార్యదర్శి ఎర్రసాని సమ్మయ్య,మండల సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్రసాని రామూర్తి, మండల ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి దంతలపెల్లి ఉపేందర్, మాజీ ఎంపిటిసి దంతలపెల్లి రవి, పంచాయతీ కార్యదర్శిలు, మాజీ సర్పంచ్లు,యూత్ నాయకులు, లబ్ధిదారులు మరియు ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

# విద్యార్థులకుమెరుగైన వైద్యం గిరిజన సంక్షేమశాఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 2: వికారాబాద్ జిల్లా కులచర్ల ట్రైబల్ వెల్ఫేర్ గురుకులానికి చెందిన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు.

విద్యార్థులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారనే విషయం తెలియగానే పరిస్థితిని ఆరా తీశారు. గురుకులంలో చదువుతున్న 600 మంది విద్యార్థుల్లో 120 మంది అనారోగ్యం పాలైనట్టు వస్తున్న ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు. సీజనల్ జలుబు, దగ్గు, జ్వరంతో 20 మంది విద్యార్థులే బాధపడుతున్నారని, వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని వివరించారు. తప్పుడు ప్రచారాలు చేసి తల్లిదండ్రులు ఆందోళన చెందేలా చేయకూడదని సూచించారు

# మరణం లేని మహనీయుడికి ఘన నివాళులు-రవీందర్



మహబూబాబాద్, సెప్టెంబర్ 2: (నేటినిజం ప్రతినిధి): తొరూర్ పట్టణ కేంద్రంలో వైఎస్సార్ 13వ వర్ధంతి సందర్భంగా తొర్రూర్ ప్రభుత్వ హాస్పిటల్ లో పండ్లు పంపిణీ చేసిన పాలకుర్తి అసెంబ్లీ కోఆర్డినేటర్ సింగారం రవీందర్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి పాలన సువర్ణ యుగం లాంటిదని ప్రతి ఒక్కరూ ఆయనను సొంత నాయకుడిగా గుర్తించుకున్నారని,ప్రాణం ఉన్నంతవరకు ఆయనను మరువరని,ఆయన చేసిన అభివృద్ధి సంక్షేమాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయని,ఆయన కోసం ఆగిన గుండెలు ఎన్నో ఉన్నాయని గుర్తు చేసుకుంటూ ఆయనకు నివాళులర్పించడం జరిగిందని తెలిపినారు మళ్ళీ తెలంగాణలో ప్రజలు సుభిక్షంగా ఉండాలి మరియు రాజన్న రాజ్యం రావాలంటే ×జూ షర్మిళ × ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలోనూతనగంటి పవన్ కళ్యాణ్ ,కన్నెబోయిన సాయికుమార్, వెలికట్టే మహేష్ ,జవ్వాజి ప్రదీప్, దేశగాని సాయికుమార్, బొల్ల శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు

# అంతర్ మంత్రిత్వ సహకారానికి పిసిఐఎంహెచ్ మరియు ఐపీసీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: ఆయుష్ మంత్రిత్వ శాఖ "వన్ హెర్బ్,వన్ స్టాండర్డ్" సాధించే క్రమంలో ఓ ముఖ్యమైన అడుగు వేసింది. అందులో భాగంగా ఫార్మాకోపోయియా కమిషన్ ఫర్ ఇండియన్ మెడిసిన్ అండ్ హోమియోపతి (ఆయుష్ మంత్రిత్వ శాఖ) మరియు ఇండియన్ ఫార్మకోపోయియా కమిషన్ (ఆరోగ్య ఢ కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ) మధ్య హెర్బ్, వన్ స్టాండర్డ్"కు అంతర్ మంత్రిత్వ శాఖల సహకారం కోసం న్యూఢిల్లీలో ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) సంతకం చేయబడింది.

ప్రొఫెసర్ (వైద్య) పి.కె. ప్రజాపతి, డైరెక్టర్ (ఇన్‌చార్జ్), పిసిఐఎండహెచ్ మరియు సెక్రటరీ–కమ్–సైంటిఫిక్ డైరెక్టర్ శ్రీ రాజీవ్ సింగ్ రఘువంశీ, ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కోటేచా సమక్షంలో ఎంఓయూపై సంతకాలు చేశారు.

ఈ సందర్భంగా ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కోటేచా మాట్లాడుతూ.. హార్మోనైజ్డ్ హెర్బల్ ఔషధ ప్రమాణాల అభివృద్ధిని సులభతరం చేయడం ద్వారా ప్రజారోగ్యాన్ని పెంపొందించేందుకు పిసిఐఎం అండ్ హెచ్ మరియు ఐపిసిల మధ్య సహకార ప్రయత్నాలను అభివృద్ధి చేయడమే ఈ ఎంఒయు యొక్క ప్రాథమిక లక్ష్యం. పిసిఐఎండహెచ్ మరియు ఐపీసీలు రెండూ ఒకే లక్ష్యంతో పని చేస్తున్నందున "ఒక మూలిక – ఒక ప్రమాణం" సాధించడానికి ప్రమాణాలను సమన్వయం చేయడం తార్కికం మరియు అవసరం అని తెలిపారు.

శాస్త్రీయ సమాచారం మరియు ఔషధ ముడి పదార్థాలు/సారాంశాలు, సెమినార్‌లు, వర్క్‌షాప్‌లు, శిక్షణ మరియు మేధోమథన కార్యక్రమాలను పంచుకోవడం ద్వారా సాంప్రదాయ ఔషధ ప్రామాణీకరణ ప్రాంతంలో సమాచార మార్పిడిని ప్రోత్సహించడానికి ఈ అవగాహనా ఒప్పందం మరింత సులభతరం చేస్తుంది. "ఒక మూలిక ఒక ప్రమాణం" క్రింద వర్గీకరించబడిన మోనోగ్రాఫ్‌ల ప్రచురణ యొక్క ఏకైక అధికారం పిసిఐఎం అండ్ హెచ్ మాత్రమే ఉంటుంది. పిసిఐఎం అండ్ హెచ్ మరియు ఐపీసీ ద్వారా అభివృద్ధి చేయబడిన ఎంఓయూ ప్రకారం మోనోగ్రాఫ్(లు) తదనుగుణంగా గుర్తించబడతాయి;సంబంధిత మోనోగ్రాఫ్‌లలో ఐపిసి సహకారం తగిన ప్రాంతం గుర్తించబడుతుంది. మోనోగ్రాఫ్‌ల సాంకేతిక విషయాలను పిసిఐఎం అండ్ హెచ్ మరియు ఐపిసి సంయుక్తంగా అభివృద్ధి చేస్తాయి. కాబట్టి ఈ మోనోగ్రాఫ్‌లు ఏఎస్‌యుడహెచ్ ఫార్మాకోపియా మరియు ఐపీలో ప్రచురించిన చట్టపరమైన రక్షణ కలిగి ఉంటాయి.

ఈ ప్రమాణాల సమన్వయం "ఒక మూలిక, ఒక ప్రమాణం మరియు ఒక దేశం" లక్ష్యాన్ని నెరవేరుస్తుందని మరియు భారతదేశంలో వ్యాపారాన్ని సులభతరం చేస్తుందని మరియు భారతీయ బొటానికల్స్ మొత్తం వాణిజ్యాన్ని మెరుగుపరుస్తుందని ఆయుష్ మంత్రిత్వ శాఖ విశ్వసిస్తోంది. ఇది భారత ప్రధానిచే ప్రోత్సహించబడిన ఆత్మనిర్భర్ భారత్ వైపు ఒక ముఖ్యమైన అడుగు అని రుజువు చేస్తుంది.

ఈ సందర్భంగా పీసీఐఎంఅండ్‌హెచ్ డైరెక్టర్ (ఇన్‌చార్జి) ప్రొ.(వైద్య) పి.కె.ప్రజాపతి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ ప్రయోజనకరంగా ఉండే మోనోగ్రాఫ్‌ల ప్రచురణకు ఈ ఎంఓయూ వీలు కల్పిస్తుంది. ఇతర సంబంధిత సాంకేతిక పనులను చేపట్టేందుకు ఔషధ మొక్కలు మరియు వాటి మూలకం మార్కర్‌ల ఎంపిక కోసం సంయుక్త కమిటీని ఏర్పాటు చేస్తారు అని తెలిపారు.

ఐపీసీ సెక్రటరీ–కమ్–సైంటిఫిక్ డైరెక్టర్ శ్రీ రాజీవ్ సింగ్ రఘువంశీ మాట్లాడుతూ "ఈ అవగాహనా ఒప్పందము మూలికా ఔషధంలోని తయారీదారులు, పరిశోధకులు మరియు నియంత్రకాలు వంటి వాటాదారులకు వారి సంబంధిత ప్రాంతాలలో ప్రపంచ స్థాయి మోనోగ్రాఫ్‌లను ఉపయోగించుకునే అవకాశాన్ని అందించబోతోంది. హెర్బల్ మెడిసిన్ రంగంలో ముఖ్యంగా నాణ్యమైన డొమైన్‌లో లోతైన పరిశోధన చేయడానికి మరియు ప్రజారోగ్యానికి దోహదపడటానికి ఐపీసీకి ఇది ఒక అవకాశం" అని తెలిపారు.

ప్రస్తుతం భారతీయ ఫార్మాకోపోయియా (ఐపీ)తో పోల్చినప్పుడు ఏఎస్‌యుడహెచ్ ఫార్మకోపోయియాస్‌లో ప్రచురించబడిన విభిన్న ప్రమాణాలు అలాగే విభిన్న విశ్లేషణాత్మక పద్ధతులు ఉన్నాయి. ఆయుష్ మంత్రిత్వ శాఖ "ఒక మూలిక – ఒక ప్రమాణం" కార్యక్రమం ద్వారా ఈ అస్పష్టతను తొలగించాలని కోరుకుంటోంది. ఈ అవగాహన ఒప్పందం ద్వారా ప్రతి మోనోగ్రాఫ్ అంతర్జాతీయ నాణ్యత అవసరాలతో పాటు భారతీయ ప్రమాణాలను కలిగి ఉంటుంది. తద్వారా అన్ని భారతీయ నాణ్యతా ప్రమాణాలు ఒకే వృక్షశాస్త్రానికి సంబంధించిన ప్రపంచ ప్రమాణాలతో సమకాలీనంగా మారతాయి.

# ఉచితాలు వద్దు అనే బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలి : మంత్రి హరీశ్ రావు



మెదక్, సెప్టెంబర్ 2 : నేటినిజం (ప్రతినిధి):ఉచితాలు వద్దు అనే బీజేపీకి బుద్ధి చెప్పాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలో నూతన ఆసరా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లడారు. కొత్తగా ఆసరా పింఛన్లు అందుకుంటున్న 584 మందికి శుభాకాంక్షలు. ఇక నుంచి మీకు నెల నెల రూ. 2,016 అందుతాయన్నారు.

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మీకు పింఛన్ రు. 75 ఉండే. ఎవరైనా చనిపోతేనే తప్పా వారి స్థానంలో నాడు కొత్తవి వచ్చేవి కావు. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 200 చేసింది. కానీ ఒంటరి మహిళలకు, చేనేత, గౌడ పింఛన్లు ఇవ్వలేదన్నారు.

కానీ, టీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం ఏకంగా 10 ఇంతలు పెంచి, రు. 2,016 చేసిందన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇస్తాం. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. కన్న కొడుకు చీరకొని ఇవ్వకపోయినా పెద్ద కొడుకు సీఎం కేసీఆర్ బతుకమ్మ చీర ఇస్తున్నరు. బిడ్డ పెళ్లికి కల్యాణ లక్ష్మి ఇస్తున్నరు.

మాకు కులం లేదు, మతం లేదు. పేదలందరికీ భరోసా ఇవ్వడమే మా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఢిల్లీలో కూర్చున్న వారు కాళేశ్వరం మీద విమర్శలు చేస్తరు. భూమికి బరువయ్యే పంట పండుతుంది.

కేసీఆర్ రైతు పక్షపాతి కాబట్టి ఇది సాధ్యం అయ్యిందన్నారు. కొంత మంది ఉచితాలు వద్దు అంటారు. అలాంటి వారికి ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ జమానాలో ఉచిత కరెంట్ కాదు ఉత్త కరెంట్ ఉండేదని ఎద్దేవా చేశారు.

# గణేష్ మండపాలలో ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలు ఏర్పాటు చేయరాదు: ఎస్పీ డా.వినీత్.జి

**– శబ్ద కాలుష్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం**

**– జిల్లా వ్యాప్తంగా సుమారుగా 850 గణేష్ విగ్రహాల ఏర్పాటు**

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 2 (నేటినిజం ప్రతినిధి) :గణేష్ నవరాత్రులలో భాగంగా ఉత్సవ కమిటీ సభ్యులు గణేష్ మండపాల వద్ద నిత్యం అందుబాటులో ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని శుక్రవారం జిల్లా ఎస్పీ డా.వినీత్.జి ఒక ప్రకటనలో తెలియజేశారు. మండపాల వద్ద పూజల కొరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉత్సవ కమిటీలు చర్యలు తీసుకోవాలని సూచించారు. వృద్ధులు, చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్కువ శబ్ద కాలుష్యంతో స్పీకర్లను ఏర్పాటు చేసుకోవాలి. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలి. పోలీసు వారి సూచనలను పాటించకుండా ఎవరైనా డీజే లను ఉపయోగిస్తే, వాటిని సీజ్ చేసి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, లక్కీ డ్రాలు నిర్వహించడం, అన్యమతస్తులను కించపరిచేలా ప్రసంగాలు చేయడం, అసభ్యకర నృత్యాలు ఏర్పాటు చేయడం లాంటివి చేస్తే



నిర్వాహకులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిత్యం తమ పోలీస్ స్టేషన్ల పరిధిలోని గణేష్ మండపాలను సందర్శిస్తూ ఉండాలని అధికారులకు సూచించారు. గణేష్ నవరాత్రులను కులమతాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా భక్తి శ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకుని నవరాత్రి ఉత్సవాల ప్రత్యేకతను, పవిత్రతను పాటిస్తూ పోలీసువారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# 'బోవేరా' ఆశయ సాధనకు కృషి చేయాలి : మంత్రి కొప్పుల




కరీంనగర్ , సెప్టెంబర్ 2: (నేటినిజం ప్రతినిధి): స్వాతంత్ర్య సమరయోధుడిగా, నవసమాజానికి ఆదర్శప్రాయుడిగా నిలిచిన బోయినపల్లి వేంకటరామారావు (బోవేరా) ఆశయసాధనకు కృషి చేయాలని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు.

బోవేరా శతజయంతి ఉత్సవాల కార్యక్రమాన్ని కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో గల బోవేరా భవన్‌లో మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం బోవేరా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..బోవేరా స్వాతంత్ర్య సమరయోధుడిగా పోరాటం సాగించి, స్వాతంత్ర్యానంతరం తరం ప్రజాప్రతినిధిగా ప్రజల మన్ననలు పొందిన మహనీయుడని కొనియాడారు.

తన జీవన ప్రయాణంలో నిత్యం ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతికి పాటుపడిన మానవతావాది, కుల వ్యవస్థను బహిష్కరించిన గొప్ప వ్యక్తి. వారి జీవితం ఉద్యమ జీవితం అని పేర్కొన్నారు.

కరీంనగర్ గాంధీగా, బోవేరాగా ప్రజలు ప్రేమతో పిలుచుకునే బోయినపల్లి వెంకటరామారావును స్మరించుకోవాలన్నారు.

కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహ ప్రతిష్ఠకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రముఖవాగ్గేయకారుడు వరంగల్ శ్రీనివాస్‌కు బోవేరా కవిత పురస్కారాన్ని మంత్రి అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రెస్ అకాడమీ, చైర్మన్ అల్లం నారాయణ, నగర మేయర్ సునీల్ రావు, బోవేరా కుమారుడు బోయినిపల్లి హన్మంతరావు, తదితరులు ఉన్నారు.

## రేపు పీజీ ఈసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 2: ఎంటెక్, ఎం ఫార్మసీ, అర్కిటెక్చర్ తదితర కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీజీఈసెట్) ఫలితాలు శనివారం (సెప్టెంబర్ 3) విడుదల కానున్నాయి. 3న సాయంత్రం 4 గంటలకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఫలితాలను చైర్మన్ లింబాద్రి విడుదల చేయనున్నట్లు కన్వీనర్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

టీఎస్ పీజీఈసెట్‌ను ఆగస్టు 2–5 తేదీల్లో రెండు సెషన్లలో నిర్వహించారు. మొత్తం 12 కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో ఉస్మానియా యూనివర్సిటీ ఈ పరీక్షలను నిర్వహించింది.

# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి.....!

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్.**



సంగారెడ్డి, సెప్టెంబర్ 2 (నేటి నిజం ప్రతినిధి) స్వీప్ యాక్టివిటీ, ఓటరు నమోదు, ఓటర్ కార్డ్ నకు ఆధార్ అనుసంధానం, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి.

జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదయ్యేల చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.

శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ రాష్ట్ర ఉన్నత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్, అదనపు కలెక్టర్ లు రాజార్షీ షా, వీరారెడ్డి లతో కలిసి పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన వారందరి వివరాలను స్థానిక పంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి సేకరించి వారిని నూతన ఓటరుగా నమోదు చేయాలనీ సూచించారు.

జిల్లాలో ఉన్న స్వయం సహాయక మహిళా సంఘాలతో బూత్ లెవెల్ స్థాయి అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, వారి సహకారంతో నూతన ఓటరు నమోదు దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు.

జిల్లాలోనీ విద్యా సంస్థల్లో చదువుతున్న 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. ఓటరు ప్రాముఖ్యత వివరిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ,జిల్లాలో ఓటరు గుర్తింపు కార్డులకు ఆధార్ అనుసంధానం వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.

ఓటరు నమోదు,ఓటరు కార్డు కు ఆధార్ అనుసంధానం చేయడం తదితర అంశాలపై సమీక్షించి, పలు సూచనలు చేశారు.

ఓటరు నమోదు ఫారాలు అవసరమైనన్ని అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. 18 సంవత్సారాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.అందుకు చౌక ధర దుకాణాల డీలర్లను భాగస్వాములను చేయాలని సూచించారు.ఓటర్లకు గరుడా యాప్ పై అవగాహన కల్పించాలన్నారు.బి ఎల్ ఓ లు,

బి ఎల్ ఓ సూపర్ వైజార్లు ప్రత్యేక దృష్టి సారించి ఓటరు కార్డు కు ఆధార్ అనుసంధానం ప్రాపర్గా చేయాలని ఆదేశించారు.వచ్చే వారం లోగా 75 శాతం ఆధార్ లింకేజి పూర్తి చేయాలని ఆయన కోరారు.

స్వీప్ ఆక్టివిటీస్ ముమ్మరం చేయాలని, అట్టి కార్యక్రమాలలో స్వయం సహాయక సంఘాల మహిళలను, పంచాయతీ సెక్రెటరీలు, ఎంపీఓలు, ఐసిడిఎస్ టీచర్లు ,సూపర్వైజర్లు, డి ఎల్ పి ఓలను భాగస్వాములను చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆధనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి, డిఆర్ఓ రాధికా రమణి, రెవెన్యూ డివిజనల్ అధికారి నగేష్, ఎలక్షన్స్ సూపరిండెంట్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# వైకుంఠ రథాన్ని ప్రారంభించిన మంత్రి ఎర్రబెల్లి



వరంగల్, సెప్టెంబర్ 2: వ్యక్తుల అంతిమ సంస్కారాలు కూడా అత్యంత గౌరవంగా సాగాలని సీఎం కేసీఆర్ కోరుకుంటున్నారు. అందుకే దేశంలో ఎక్కడా లేని విధంగా వైకుంఠధామాలను ఏర్పాటు చేశారని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శుక్రవారం తొర్రూరు పురపాలక సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైకుంఠ రథాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి గ్రామానికి ఒక వైకుంఠధామం ఏర్పాటు అయింది. అన్ని రకాల సదుపాయాలతో వాటిని ఏర్పాటు చేశామన్నారు. నగరాలు, పట్టణాలలో కూడా మోడల్ వైకుంఠధామాలను నిర్మించాం. ఇప్పుడు తొర్రూరు పట్టణంలో పాలక వర్గం, అధికారులు కలిసి వైకుంఠ రథం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలు వైకుంఠ రథాన్ని వినియోగించుకునే విధంగా అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు.

## జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు

మెదక్, సెప్టెంబర్ 2 : నేటినిజం (ప్రతినిధి):జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ రాష్ట్ర ఉన్నత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో మేడ్చల్ నుండి జిల్లా కలెక్టర్ హరీష్, అదనపు కలెక్టర్ రమేష్ తో కలిసి పాల్గొన్నారు.రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ, 2004 జనవరి ఒకటి నుండి 2004 డిసెంబర్ 31 వరకు జన్మించిన పిల్లల వివరాలను స్థానిక పంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి సేకరించి వారిని నూతన ఓటరుగా నమోదు చేయాలనీ, అదే విధంగా గత సంవత్సరం కాలంలో మరణించిన వారి వివరాలను పంచాయతీ, మున్సిపాలిటీ నుండి సేకరించాలని సూచించారు.పంచాయతీలు, మున్సిపాలిటీల నుండి వచ్చిన జాబితాను బూత్ స్థాయి అధికారుల పరిధి నిర్దేశించి బాధ్యతలు అప్పగించాలని, నూతన ఓటరు నమోదు, మరణించిన వారి తొలగించే ప్రక్రియ చేపట్టాలని ఆయన ఆదేశించారు.జిల్లాలో ఉన్న స్వశక్తి మహిళా సంఘాలతో బూత్ లెవెల్ స్థాయి అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని, సెప్టెంబర్ 5 నుంచి 9 వరకు సదరు సమావేశాలు ప్రారంభించాలని సూచించారు. జిల్లాలో ఉన్న ప్రతి బూత్ కవర్ అయ్యేలా స్వశక్తి మహిళా సంఘాల సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సెప్టెంబర్ 11 నుంచి సెప్టెంబర్ 16 వరకు జిల్లాలో ఉన్న గర్భవతులు, బాలింతలను ఓటరు జాబితాలో నమోదు చేయడం పై శ్రద్ధ వహించాలని, ఇందుకు గాను అంగన్ వాడి టీచర్లను, సహాయకులను వినియోగించుకోవాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో ఉన్న కళాశాల నుంచి విద్యార్థుల్లో అంబాసిడర్ లను ఏర్పాటు చేసి వారితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించాలని సూచించారు. జిల్లాలోనీ విద్యా సంస్థల్లో చదువుతున్న 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. సెప్టెంబర్ 19 నుంచి సెప్టెంబర్ 24 వరకు జిల్లాలో ఉన్న ఆసుపత్రులలో ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టాలని, జిల్లాలో ఉన్న వ్యాపారులతో చర్చించి వారి సంస్థలో పని చేస్తున్న వారందరికీ ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. జిల్లాలో ఉన్న దివ్యాంగుల జాబితా సదరం క్యాంపు నుంచి సేకరించి వారి వివరాలను ఓటరు జాబితాలో నమోదు చేయాలని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో ఓటరు ప్రాముఖ్యత వివరిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.వీడియో సమావేశం అనంతరం కలెక్టర్ అధికారులతో నిర్వహించిన తెలికన్ఫరెన్స్ లో మాట్లాడుతూ, స్వశక్తి మహిళా సంఘాలతో సమావేశాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించి, ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి సూచించారు. ఈ వీడియో సమావేశంలో స్వీప్ నోడల్ అధికారి రాజిరెడ్డి, ఈ.డి.ఎమ్ సందీప్, డి.ఆర్.డి. ఓ. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

